నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం సెప్టెంబర్ 24, 2024 www.navatelangana.com

మరోసారి నిజాంసాగర్ గేట్లు ఎత్తివేత

నవతెలంగాణ-నిజాంసాగర్




ఎగువ ప్రాంతాలలో కురిసిన వర్షాలకు నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతుండటంతో సోమవారం సాయంత్రం ప్రాజెక్టు గేట్లను అధికారులు ఎత్తి నీటిని దిగువకు విడుద చేశారు. ప్రాజెక్టులోకి 8000 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుందని ప్రాజెక్ట్ ఏఈఈ శివ తెలిపారు. ప్రాజెక్ట్ నిండుకుండలా మారడంతో రెండు గేట్ల ద్వారా అంతే నీటిని దిగువ మంజీర నదిలోకి వదులుతున్నట్లు ఆయన తెలిపారు. నది పరివాహక ప్రాంతాలలోని ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 17.802 టీఎంసీలకు గాను ప్రస్తుతానికి ప్రాజెక్టులో 17.773 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఎస్సారెస్పీకి 14 వేల ఇన్‌ఫ్లో

- అదే స్థాయిలో కాలువలకు నీటి విడుదల

నవతెలంగాణ-మెండోరా



వరద కాలువకు కొనసాగుతున్న నీటి విడుదల

ఉత్తర తెలంగాణ వరప్రదాయిని ఎస్సారెస్పీకి ఎగువ ప్రాంతాలనుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సోమవారం 14,170 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. కాగా కాకతీయ, ఎస్కేప్, వరద కాలువలకు అదే స్థాయిలో నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1091 అడుగులు 80.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం అదే స్థాయిలో నీరు నిల్వ ఉంది. ఈ ఏడాది జూన్ 1వ తేదీ నుంచి ప్రాజెక్టుకు 188.694 టీఎంసీల నీరు వచ్చి చేరగా, దిగువకు 115.593 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేశారు.

పోరాడితేనే లేబర్‌కోడ్‌లు రద్దు

- కార్మిక చట్టాలను రక్షించుకుందాం
- సీఐటీయూ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు
- సెప్టెంబర్ 23 బ్లాక్ డే పురస్కరించుకొని కరపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్/కామారెడ్డి





లేబర్‌కోడ్ కరపత్రాలను దహనం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు.. కామారెడ్డిలో వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కేంద్ర బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్యంగా తిప్పి కొట్టి కార్మిక చట్టాలను రక్షించుకుందామని, లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాడుదామని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కేంద్ర కార్మికసంఘాల పిలుపు మేరకు సెప్టెంబర్ 23న బ్లాక్ డే కార్యక్రమంలో భాగంగా సోమవారం నిజామాబాద్, కామారెడ్డి జిల్లా కేంద్రాల్లో నిరసన చేపట్టారు. నిజామాబాద్ జిల్లా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చౌక్‌లో ప్లే కార్డ్‌తో బిజెపి కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్యక్రమం నిర్వహిస్తూ లేబర్ కోడ్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహన్, ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నర్సింగ్ రావు, ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు శివ భూమయ్య మాట్లాడారు. అదే విధంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో బ్లాక్ డే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ మాట్లాడారు.

2019లో వేతనాల కోడ్‌ను 2020లో ఐఆర్ కోడ్‌ను ఓఎస్ హెచ్ కోడ్ సామాజిక భద్రత కోడ్ మొత్తము నాలుగు లేబర్ కోడ్లను బిజెపి ప్రభుత్వం పార్లమెంట్లో ఆమోదించిందన్నారు. అంతకుముందు కార్మికులకు ఉన్నటువంటి 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చి బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ విదేశీ, స్వదేశీ పెట్టుబడుదారులకు యాజమానులకు అనుకూలంగా చట్టాలను కట్టబెట్టే ప్రయత్నం కొనసాగుతుందన్నారు. తద్వారా కార్మిక వర్గానికి తీరని నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

పార్లమెంట్లో ప్రజాస్వామ్య బద్దంగా చర్చలు జరపకుండా యాజమాన్యాలకు కొమ్ముగాస్తు తెచ్చిన కోడ్‌లను రద్దు చేయాలని గత నాలుగు సంవత్సరాలుగా నిరసనలు, రెండుసార్లు దేశవ్యాప్త సమ్మెలు జరిగినా సమరశీల ఉద్యమాలు జరిగినా బిజెపి ప్రభుత్వం కార్మికుల పోరాటాలను లెక్కచేయకుండా 2024 పార్లమెంట్లో ఎన్నికల సందర్భంలోనూ వామపక్షాలు, ప్రతిపక్ష పార్టీలు దేశవ్యాప్తంగా లేబర్ కోడ్ రద్దు చేయాలని వ్యతిరేకించినప్పటికీ బిజెపి కార్మిక వర్గానికి ద్రోహం చేయడానికి నిశ్చయించుకుందని అన్నారు. దేశంలో ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో ఈ లేబర్ కోడ్లను అమలు చేసేందుకు రూల్స్ తీసుకొచ్చిందని, కొన్ని రాష్ట్రాల్లో అమలు చేయడం కోసం ప్రయత్నం కొనసాగుతుందని అన్నారు. కార్మిక వర్గం హక్కులను ఉరితాళ్లుగా మార్చే విధంగా బిజెపి ప్రభుత్వం కొనసాగించే దశలో ఉందని అన్నారు. మారిన లేబర్ కోడ్లను దేశవ్యాప్తంగా కార్మిక వర్గం రైతాంగం వ్యతిరేకిస్తూ 2024 సెప్టెంబర్ 23న బ్లాక్ డే పాటించాలని కేంద్ర కార్మిక సంఘాల నిర్ణయించాలని అందులో భాగంగానే సోమవారం ఈ ప్రాంతంలో నిరసన కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు.

ఒకపక్క దేశంలో నిత్యావసరాల సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న వాటిని పట్టించుకోకుండా గాలికి వదిలేసి కార్మికులకు కనీస వేతనం పెంచకుండా ఇబ్బందుల పాలు చేసే ప్రయత్నం బిజెపి ప్రభుత్వం చేస్తుందని మండిపడ్డారు. అందుకోసమే మనం బతకడం కోసం కనీస వేతనాలు నెలకి 26 వేల రూపాయలు వేతనం కావాలన్నారు. కార్మిక హక్కులను రక్షించు కోవాలనీ, 8 గంటల పని దినాలను అమలు చేసుకునేందుకు పెద్ద ఎత్తున బిజెపి విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కామారెడ్డిలో నిర్వహించిన కార్యక్రమంలో అరుణ్, దొడ్లే మోహన్, నర్సింలు, ఇంద్ర కుమార్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌లో సీఐటీయూ జిల్లా నాయకులు జంగం గంగాధర్, కటారి రాములు, ఐఎఫ్‌టీయూ నాయకులు ముత్తన్నా, నరేందర్, ఏఐటియుసి నాయకులు రాజన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు భూమన్న గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.





తహసీల్దార్‌తో మాట్లాడుతున్న రైతులు

రైతుల వివరాలు పరిశీలిస్తున్న అధికారులు

అధికారులపై రైతులు కన్నెర్ర

- గిడ్డంగుల్లోని ధాన్యం అమ్ముకోనివ్వకుండా అడ్డుకుంటున్నారని మండిపాటు
- 48 మంది రైతులకు చెందిన 18 వేల క్వింటాల ధాన్యం గిడ్డంగులోనే

నవతెలంగాణ-కోటగిరి

ధర వచ్చిన తర్వాత ధాన్యం అమ్ముకునేందుకు గిడ్డంగుల్లో నిల్వ ఉంచిన ధాన్యాన్ని విక్రయించుకునేందుకు మార్కెట్ కమిటీ అధికారులు అనేక కొర్రీలు పెడుతున్నట్టు రైతులు వాపోయారు. 48 మంది రైతులకు చెందిన 18 వేల క్వింటాళ్ల ధాన్యం గోదాము ల్లోనే మూలుగుతుందని, దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నట్టు వాపోయారు. కోటగిరి మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీలో సోమ వారం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ గంగాధర్ మార్కెట్ కమిటీలో రైతుల వరి ధాన్యపు నిలు వలుపై విచారణ చేపట్టారు. గతేడాది డిసెంబర్ నుండి నేటి వరకు వారికి అమ్ముకోవ డానికి అవకాశం లేకుండా నానా కొర్రీలు పెడుతున్నారు. పలుసార్లు సమా వేశమైన ప్పటికీ నిలవజేసిన కాగితాలు, వారు కౌలుదారుల, రైతులా అంటూ కాలయాపన చేస్తూ అధికారుల నిర్లక్ష్య వైఖరితో తాము ఎంతో నష్టపోయామని రైతులు వాపోయా రు. పలుసార్లు జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చిన ప్పటికీ స్థానిక మార్కెట్ కమిటీ సెక్రటరీ నిర్లక్ష్య వైఖరి వారికి శాపంగా మారింది.

నూతన పాలకవర్గం ఏర్పాటు కావడం, గతంలో పనిచేసిన కార్యదర్శి సస్పెండ్ కావడం తదితర కారణాలతో ఇబ్బందులకు గురవుతున్నట్టు రైతులు తెలిపారు. తహసీ ల్దార్ గంగాధర్ మార్కెట్ కమిటీకి చేరుకునే సరికి సెక్రెటరీ శ్రీనివాస్ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనం తరం ఆయనను పిలిపించి మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావుతో, వ్యవసాయ సిబ్బందితో రైతుల వివరా లను అడిగి తెలుసుకున్నారు. కోర్టు నుంచి ఆర్డర్ వచ్చిన ప్పటికీ సెక్రటరీ నానారకాలుగా ఇబ్బంది చేస్తున్నా రని రైతులు వాపోయారు. మాకు వేరే దిక్కు లేదని మా ధాన్యం మాకు ఇప్పించండి అని మొరపెట్టుకున్నారు. గతంలో పని చేసిన మార్కెట్ కమిటీ చైర్మన్లు పలుసార్లు సెక్రెటరీ చెప్పిన ప్పటికీ సెక్రటరీ ఇష్టారాజ్యంగా వ్యవహరి స్తున్నారని సమా ధానం ఇస్తున్నట్టు తెలిపారు. రైతులవి పూర్తి వివరాలు సేకరించి వారి ధాన్యం వారికిఅప్పగిస్తామని తెలిపారు.

చెరువు నుంచి వృథాగా పోతున్న నీరు

- పట్టని ఇరిగేషన్ అధికారులు



చెరువు నుంచి లీకేజీ అవుతున్న నీరు

నవతెలంగాణ-మోపాల్

గత కొద్ది రోజుల క్రితం భారీగా కురిసిన వర్షానికి మోపాల్ మండలంలోని మంచిప్ప చెరువులో పూడిక ఏర్పడి నీరు వృథాగా పోతుంది. గతేడాది నుంచి నీరు వృథాగా పోతున్న అధికారులకు, గ్రామస్తులు పలుమార్లు విన్నవించినా వాళ్ళు పట్టించుకోకుండా ఈ ఏడాది వర్షాకాలము మొదలవ్వకముందే అధికారులు ఎలాంటి కాంక్రీట్ వాడకుండా కేవలం మట్టితో నామమాత్రంగా ఆ పూడికను పూడ్చి వెళ్లిపోయారు. భారీ వర్షానికి ఈ ఏడాది ఆ పూడికకు ఇంకా పగుళ్ల ఏర్పడి భారీ ఎత్తున నీరు బయటకు వృథాగా పోతుంది. ప్రస్తుతం వర్షాకాలం సీజన్ ముగింపునకు వస్తున్న సమయంలో చెరువులోని నీటిమట్టం తగ్గిపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే వచ్చే పంటపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ పూడికని తాత్కాలికంగా అయినా మరమ్మత్తులు చేసి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు తమ మొద్దు నిద్రను వీడి గ్రామాల్లో పర్యటించాలని అలా పర్యటించినప్పుడే చెరువుల సమస్యలు గ్రామాల్లో నీటి సమస్యలు తెలుస్తాయని పేర్కొంటున్నారు.



ఎన్నికైన కార్యవర్గం

అకౌంట్స్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ ట్రెజరిస్, అకౌంట్స్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ సాధారణ సర్వసభ్య సమావేశం సోమవారం నూతన కలెక్టరేట్‌లోని ట్రెజరీ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకు న్నారు. ఈ సమావేశాన్ని అధ్యక్షులుగా ఎన్నికైన రాములు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ట్రెజరి డిపార్ట్ మెంట్ సమస్యల గురించి చర్చించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ట్రెజరీ అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గందల పురుషోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి పరుశురాం, ఇతర కార్యవర్గ సభ్యులు సాయిరెడ్డి, శ్రీనివాస్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, టీటీఎస్ జీవోఏ అధ్యక్ష, కార్యదర్శులు మారుతి, కార్తీక్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్ట శ్రీవాస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ట్రెజరరీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

పసుపు పంటపట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

- పెర్కిట్‌లో పసుపు పంట పరిశీలన



పసుపు పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త, ఆర్టికల్చర్ అధికారి

నవతెలంగాణ-ఆర్మూర్

రైతులు పసుపు పంట యదు తగు జాగ్రత్తలు తీసుకొని సస్యరక్షణ చర్యలు పాటించాలని కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన సంస్థ శాస్త్రవేత్త మహేందర్ తెలిపారు. పట్టణంలోని పెర్కిట్‌లో సోమవారం నియోజకవర్గ ఆర్టికల్చర్ అధికారిని సంధ్యారాణితో కలిసి పరిశీలించారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల రైతులు చీడపీడల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. దుంప కుళ్ళు తెగులుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులు వివరించారు. అలాగే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్విజ్ పోటీలు

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

"జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలోని, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లా స్థాయి క్విజ్ పోటీలు" యూత్ ఫెస్ట్ లో భాగంగా నెహ్రూ యువ కేంద్ర ఆఫీసులో సోమవారం నిర్వహించారు. జిల్లాలోని 13 ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 9 వ, 10వ తరగతి విద్యార్థులకు హెచ్ఐవి ఎయిడ్స్, టీబీ పై పోటీలు నిర్వహించారు. ఇందులో మొదటి ప్రైజ్ (1000 రూపాయలు క్యాష్ ప్రైజ్), జీహెచ్ఎస్ కోటగల్లికి చెందిన చంద్రజ, శర్వాజ్, ద్వితీయ స్థానం (750 రూపాయలు క్యాష్ ప్రైజ్) కు జీహెచ్ఎస్ కుమార్‌గల్లి స్వాతి, కావేరి, తృతీయ స్థానం (500క్యాష్ ప్రైజ్) విజయ్‌సాయి బోధన్ బూస్ర, జవేరియా అందుకున్నారు. ఈ ప్రైజ్‌లు అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారిణి దేవి నాగేశ్వరి, జిల్లా యూత్ కోఆర్డినేటర్ శైలి బెల్లాల్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ ఘనపూర్ వెంకటేశ్వర్లు, డీపీఎం సుధాకర్, జిల్లా సైన్స్ అధికారి కస్తూరి గంగా కిషన్, జిల్లా టిబి కో ఆర్డినేటర్ రవిగౌడ్, నవీన్, విద్యార్థులు, టీచర్స్ పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశాలకు

7వ తేదీ వరకు గడువు పొడగింపు

నవతెలంగాణ-నిజాంసాగర్

నవోదయ పాఠశాలలో 2025-2026 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు మరోసారి గడువు పొడిగించారు. అక్టోబర్ 7 వరకు పెంచుతున్నట్లు విద్యాలయ ప్రిన్సిపల్ సత్యవతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష వచ్చే ఏడాది జనవరి 18న నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు https://navodaya.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నోటిఫికేషన్ ప్రకారం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల పిల్లలకి 75% సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా గ్రామీణ ప్రాంత విద్యార్థులందరూ ఉపయోగించుకోవాలని సూచించారు.

కమ్మర్‌పల్లి ఐటీఐలో 5 ఫేజ్ స్పాట్ అడ్మిషన్లు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ప్రభుత్వ ఐటిఐ కమ్మర్‌పల్లిలో అడ్మిషన్స్ జరిగిన తరువాత ఐటిఐ నందు వివిధ ట్రేడ్స్‌లో 97 సీట్లు మిగిలినందున 5వ ఫేజ్ వాక్‌ఇన్ అడ్మిషన్‌లకు అవకాశం ఉందనిపదవ తరగతి పాసైన నిజామాబాదు జిల్లా ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.కోటిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి, రెండవ, మూడవ ఫేజ్‌లలో అడ్మిషన్స్ పొందినవారు దీనికి అనర్హులు అని, అందరూ కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోడానికి వెబ్ సైట్ ఓపెన్ చేసినట్లు తెలిపారు. వాక్ ఇన్‌అడ్మిషన్లు ఈనెల 25 నుండి 28 వరకు ప్రతి రోజు వర్కింగ్ డేస్ లలో అడ్మిషన్స్ ఐటిఐలో జరుగుతాయని, దరఖాస్తులతో పాటు ఒరిజినల్ ధ్రువీకరణపత్రాలు తీసుకొని కమ్మర్‌పల్లి ఐటిఐలో మద్యాహ్నం 12 లోపు హాజరు కాగలరు అని, మీకు కావలిసిన, మిగిలిన వివిధ ట్రేడ్స్ లో సీటు పొందగలరాని సూచించారు. మరింత వివరాల కోసం 8106794500 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

కేసు పెడతాం.. పరువునష్టం దావా వేస్తాం

- మా మీదే వార్త రాస్తావా అంటూ నవతెలంగాణ విలేకరికి ఓ ఎన్జీవో నుంచి బెదిరింపులు
- వచ్చిన ఆరోపణలు నివృత్తి చేయకుండా జర్నలిజం గొంతునొక్కే ప్రయత్నం

నవతెలంగాణ-భిక్కనూర్

ఎన్‌జీవో సంస్థ.. అంటే ప్రజలకు మేలు చేసే స్వచ్ఛంద సంస్థలు అని పేరుగాంచాయి. కానీ పలువురు మాత్రం ఆ పేరుకున్న అసలు ఉద్దేశం చెరిపేసే ప్రయత్నాలు చేస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కాగా ఓ ఓన్జీవో సంస్థ మీద వచ్చిన ఆరోపణలపై నవతెలంగాణలో సోమవారం ప్రచురితమైన కథనంపై సదరు సంస్థ నిర్వహకులు చిర్రుబుర్రులాడారు. నవతెలంగాణ విలేకరికి ఫోన్ చేసి పోలీస్ కేసు పెడతాం, పరువునష్టం దావా వేస్తామంటూ బెదిరింపులకు దిగారు. సంస్థ మీద ఆరోపణలు, అనుమానాలు వచ్చిన సందర్భంగా వాటిని నివృత్తి చేయాల్సి ఉండగా.. అందుకు విరుద్ధంగా బెదిరింపులకు దిగడం గమనార్హం. వివరాల్లోకి వెళ్తే..

ఆహార వ్యాపార సంస్థలు ఫుడ్ ట్రెనింగ్ సర్టిఫికేట్‌లు తీసుకోవాలని అందుకు 1500 నుంచి 3000 వేలు చెల్లించాల్సి ఉంటుందని ఓ ఎన్‌జీవో సంస్థ తమ మండలాలకు తమ ఏజెంట్‌లను పంపి వివరాలు సేకరిస్తుంది. అయితే వచ్చిన ఏజెంట్‌లు ప్రభుత్వ సంస్థ అయిన ఫుడ్ ఇన్స్‌పెక్టర్ ఆఫీస్ నుంచి వస్తున్నామని చెప్తూ వివరాలు నమోదు చేసుకుంటుండటం గమనార్హం.

కానీ జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ అనుమతి తీసుకోకుండా వారి ఆఫీస్ నుంచి వస్తున్నామని చెప్పి ఫుల్ ట్రెనింగ్ సర్టిఫికెట్ తీసుకోవాలని భయభ్రాంతులకు గురి చేస్తున్న వైనంపై "ఫుడ్ ట్రెనింగ్ సర్టిఫికెట్ పేరుతో వసూళ్లు" అనే శీర్షికతో నవతెలంగాణ దినపత్రికలో కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ శీర్షికపై సదరు ఎన్జీవో సంస్థ నిర్వాహకులు నవతెలంగాణ విలేఖరికి ఫోన్ చేసి 'మా ఎన్జీవో సంస్థ పైనే వార్త రాస్తావా..? నీ పైన కేసు పెడతాం. పురువునష్టం దావా వేస్తం' అని బెదిరింపులకు పాల్పడటం గమనార్హం. వాస్తవానికి సదరు ఎన్జీవో సంస్థ రాష్ట్ర ఫుడ్ కమిషనర్ శాఖ నుండి అనుమతి తీసుకొని జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో అనుమతి పత్రాలను అందజేసి ఫుడ్ ట్రెనింగ్ సర్టిఫికెట్ జారీ చేయాల్సి ఉంటుంది. జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ శిరీషను ఎన్జీవో సంస్థ ఫుడ్ ట్రెనింగ్ సర్టిఫికెట్ జారీ చేస్తామని అనుమతి కోరగా ఫుడ్ ఇన్స్పెక్టర్ పేరు ఎక్కడ చెప్పకుండా జారీ చేసుకోవాలని, ఎవరిని ఎలాంటి ఇబ్బందులకు గురి చేయవద్దని తెలియజేసిన సదరు ఎన్జీవో సంస్థ నిర్వాహకులు ఫుడ్ ఇన్స్పెక్టర్ పేరు చెప్పి ఫుడ్ ట్రెనింగ్ సర్టిఫికెట్ తీసుకోవాలని వ్యాపార సంస్థలకు తెలియజేస్తున్నారు. జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ నుండి అనుమతులు తీసుకోకుండా ఫుడ్ ట్రెనింగ్ సర్టిఫికెట్ ప్రచారం విషయంలో వార్త ప్రచురించినందుకు సదరు ఎన్జీవో సంస్థ నిర్వాహకులు బెదిరింపులకు పాల్పడడం విడ్డూరంగా ఉంది. ఏకంగా ఫుడ్ ఇన్స్పెక్టర్ అధికారే ఫుడ్ ట్రెనింగ్ సర్టిఫికెట్ అనుమతులు ఇవ్వలేదని తెలియజేసినా అనుమతులు తీసుకోకుండా వార్త రాసిన విలేకరిపై బెదిరింపులకు పాల్పడటం పట్ల ఆ సంస్థ తీరుపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి.



డి.శ్రీనివాస్ స్మారక పోటీల్లో విజయ్ విద్యార్థినులు


గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేత

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ స్పోర్ట్స్ ప్రమోషన్ సొసైటీ ఆధ్వర్యంలో మాజీ రాజ్యసభ సభ్యుడు ధర్మపురి శ్రీనివాస్ స్మారకార్థం పాత కలెక్టరేట్లోని డిఎస్ఏ మైదానంలో ఈనెల 23నుండి 27 వరకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొననున్నారు. ప్రారంభ పోటీలలో భాగంగా నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్‌లో విజయ్ హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న 32 మంది బాలికలు పాల్గొని మొదటి స్థానంలో నిలిచారు. రూ. 5వేల నగదు, మెమెంటో బహుమతిగా అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.

వలకు చిక్కిన 20 కేజీల చేప


20 కేజీల చేపను చూపుతున్న మత్స్యకారుడు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్ర శివారులోని ఉప్లూర్ వెళ్లే దారిలో ఉన్న శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు వరద కాలువలో సోమవారం భారీ బొచ్చ చేప జాలరుల వలకు చిక్కింది. స్థానిక మత్స్యకారుడు ఉట్నూర్ రాజేష్ వరద కాలువలో చేపల వేట కోసం ఆదివారం సాయంత్రం వల వేసి ఉంచాడు. సోమవారం ఉదయం చేపల కోసం వేసిన వలను బయటకు తీయగా అందులో రాజేష్‌కు 20 కేజీల భారీ చేప వలకు చిక్కింది. ప్రతిరోజు చేపలను విక్రయించే ప్రదేశానికి తీసుకువచ్చాడు. చేపల కొనుగోలు కోసం వచ్చిన ప్రజలు కూడా 20 కిలోల భారీ చేపను చూసి ఆశ్చర్యపోయారు.

విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అభినందన


మండల స్థాయి క్రీడాల్లో గెలుపొందిన విద్యార్థులు

నవతెలంగాణ-నవీపేట్

మండల స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చాటిన మండలంలోని నాళేశ్వర్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులకు గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. మండల స్థాయి క్రీడా పోటీల్లో తొమ్మిది బహుమతులను గెలుచుకున్న సందర్భంగా వీడీసీ సభ్యులు, గ్రామస్తులు విద్యార్థులను, ఉపాధ్యాయులను డప్పు భాజాలతో ఆహ్వానించారు. ఏర్పాటు చేసిన సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయుడు సంతోష్‌ను శాలువాతో సన్మానించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయు లు శ్రీదీప్, సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాన్లు, మాజీ సర్పంచ్ ద్యాగ సరిన్, మాజీ సర్పంచ్ లక్ష్మణ్, వీడీసీ సభ్యులు సురేష్, మోహన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

దైవదర్శనానికి వెళ్తూ ఫిట్స్‌తో వ్యక్తి మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్


మృతి చెందిన రావుసాబ్

దైవదర్శనానికి వెళ్తూ ఓ వ్యక్తికి ఫిట్స్ రావడంతో మృతి చెందాడని నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ సాయిరెడ్డి సోమవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి 9 గంటలకు నిర్మల్ జిల్లా కుబీర్ మండల్ సిర్పల్లి గ్రామానికి చెందిన రావు సాబ్ (38) లేబర్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆయన భార్య సవితతో కలసి పండరిపూర్ దేవాలయం వెళ్దామని బాసర రైల్వే స్టేషన్‌కు రాగా కొన్ని రోజుల నుంచి జ్వరంతో బాధపడుతూ బాసర్‌లో ఫిట్స్ వచ్చింది. అంబులెన్స్ వాళ్లు వచ్చి చూడగా చనిపోయాడని ధ్రువీకరించారు. మృతుని భార్య రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు మృతదేహాన్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు మృతదేహానికి పంచనామ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్సై సాయిరెడ్డి తెలిపారు.

ముబారక్‌నగర్‌లో స్వచ్ఛతా హి సేవ

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని 18వ డివిజన్ 4బి సర్కిల్ ముబారక్‌నగర్ ప్రాంతంలో నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మకరంద్ ఆదేశాల మేరకు సోమవారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా వనోత్సవం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏడిఐ కమిషనర్ హాజరై పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.ఇంటి ఆవరణతో చుట్టుపక్కల కూడా శుభ్రం చేసుకోవాల్సిన బాధ్యత మనపైన ఉందని అన్నారు. నిజామాబాద్ మున్సిపల్ ఆర్పీలు, ఎస్జీహెచ్ సంఘాలు, విద్యార్థులు కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పేకాట సావరంపై దాడి

- నలుగురి అరెస్ట్, రూ.11,390 స్వాధీనం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ఐదవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ గంగాధర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడులలో నలుగురు పేకాటరాయుళ్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సాయినగర్ ప్రాంతంలో పలువురు పేకాటడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్సై గంగాధర్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. ఈ సమయంలో పేకాడుతున్న నలుగురుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి వద్ద నుంచి రూ.11,390 సీజ్ చేశారు. దాడిలో ఏఎస్సై రమేశ్, కానిస్టేబుళ్లు ఆనంద్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

కుర్చీల వితరణ



నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని కిసాన్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం పూర్వ విద్యార్థి ఆర్.రామకృష్ణ తన ఔదార్యం చాటుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం కుర్చీలను విరాళం అందజేశారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సమస్యను తెలుసుకొని కంప్యూటర్ సెట్ల్ వద్ద కుర్చీలు లేకపోవడంతో 20 కుర్చీలను సోమవారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర కుమార్, పూర్వ విద్యార్థి షేక్ రహీముద్దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఇందిరమ్మ వరద కాలువ ద్వారా నీటి విడుదల

నవతెలంగాణ-బాల్కొండ

శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నుంచి ఇందిరమ్మ వరద కాలువ ద్వారా మధ్యమనేరు రిజర్వాయర్‌కు ఎస్సారెస్పీ అధికారులు సోమవారం వరద నీటిని విడుదల చేశారు. మండల పరిధిలోని బస్సాపూర్ గ్రామం వద్ద ఇందిరమ్మ వరద కాలువ హెడ్ రెగ్యులేటర్ నుంచి 5000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డిఈఈ గణేష్ తెలిపారు. ఇందిరమ్మ వరద కాలువ దిగువన చేపలు పట్టే వారు, పశువుల కాపర్లు, రైతులు, సాధారణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ రెగ్యులేటర్ ఇంచార్జ్ మాధురి, గేట్ ఆపరేటర్ నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ఇన్చార్జికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సీఎం

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని సోమవారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడటంలో సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ జన్మదినం సందర్భంగా 15 రోజుల పాటు జరిగే సేవా మహాజ్ఞాన కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రైల్వేస్టేషన్‌లో ఉన్న పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతు.. మూడోసారి భారతదేశ ప్రధానిగా సేవలందిస్తున్న నరేంద్రమోడీ ప్రపంచ స్థాయి నాయకునిగా ఎదగడం గర్వించదగ్గ విషయమని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 97 ఫిర్యాదులు

- పలు సమస్యలపై ఫిర్యాదులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ


ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 97 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, డీఆర్డీఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, అదనపు ఎస్పీ బస్వారెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ కార్ బిల్లును చెల్లించండి

బీసీ వెల్ఫేర్ డిపార్టెమెంట్లో కారును అద్దె ప్రతిపాదిక కొనసాగిన కారు పెండింగ్ బిల్లుల చెల్లింపు చేయాలని కే. విజయ్ కుమార్ కోరారు. సోమవారం ప్రజావాణిలో భాగంగా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 సంవత్సరంలో కారును అద్దె ప్రతిపాదికన బీసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్లో పెట్టానన్నారు. కాని ఆ బిల్లులు ఇంకా పెండింగ్ లోనే ఉన్నాయని తెలిపారు. అధికారులను ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోవడం లేదని, 80వేల రూపాయలు బడ్జెట్ వచ్చిందని, ఆ తరువాత బిల్లులు రిజక్ట్ అయ్యాయని, మళ్ళీ బడ్జెట్ వస్తే బిల్లులు పెడతామని చెప్పారు అని అన్నారు. 2024లో బడ్జెట్ వస్తే ఆ బిల్లును డిబిసిడిఒ బినామీ కారు పేరు పైన ఉన్న బిల్లులు పెట్టుకున్నారని, తన బిల్లులు అడిగితే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పెండింగ్ బిల్లులు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

పాస్టర్‌పై చర్యలు తీసుకోవాలి : మాల సంఘం

అక్రమంగా మంచినీళ్ల బావిని కూల్చివేసి రోడ్డుపై గోడ నిర్మించి అనుమతి లేకుండా జనావాసాల మధ్య చర్చిని నిర్మిస్తున్న పాస్టర్‌పై చర్యలు తీసుకోవాలని మాల కుల సంఘం వారు ఆరోపించారు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. బీమ్‌గల్ పట్టణానికి చెందిన మాలకుల సంఘం సభ్యులం కొన్ని సంవత్సరాల క్రితం తాగునీటి అవసరాలకోసం తవ్విన బావిని పూడ్చి రోడ్డును అక్రమంగా అక్రమించి గోడ కట్టిన చొక్కం ఇజ్రాయిల్ కుల సంఘవారిపై దౌర్జన్యం చేస్తు మనోభావలను దెబ్బతిస్తున్నాడని ఆరోపించారు. రోడ్డు బావి ఆక్రమణపై మున్సిపల్ అధికారులకు 31-10-2022 దరఖాస్తు చేయగా చొక్కం ఇజ్రాయిల్‌కు వారం రోజుల్లో గోడ కూల్చి వేయాలని నోటీసు జారీ చేశారన్నారు. కానీ ఇప్పటి వరకు కూల్చలేదని, మాలకుల సంఘం సభ్యులపై దౌర్జన్యం చేస్తు తిడుతున్నారన్నారు. జనావాసాల మధ్య అనుమతి లేకుండా చర్చి నిర్వహిస్తున్నారని, చర్చిని తొలగించి మంచినీళ్ళ బావిని, రోడ్డును పునరుద్ధరించాలని మాల కులసంఘం సభ్యులు కోరారు. కార్యక్రమంలో మాల సంఘం అధ్యక్షులు తూము రవీందర్, ఉపాధ్యక్షులు బద్దం సంపత్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూములను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం మునిపెల్లి గ్రామంలో దళితుల భూములను దౌర్జన్యంగా కబ్జా చేస్తున్న 12 మంది పైన చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన సుమారుగా 50 మంది దళితులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో రావట్ల నచ్చన్న మాట్లాడుతూ మాదిగ కులానికి చెందిన తనకు ఎకరం భూమి ఉందని, కానీ ఆ భూమిని గ్రామానికి చెందిన కొందరు కబ్జా చేస్తూ అందులో శివలింగం ప్రతిష్టాపన చేసుకున్నారని తెలిపారు. ఇదేమిటని అడిగిన తమను దుర్భాషలాడుతూ దౌర్జన్యానికి పాల్పడుతున్నర న్నారు. ఈ విషయమై జక్రన్ పల్లి పోలీస్ స్టేషన్లో ఎస్‌హెచ్ఒకు ఫిర్యాదు చేయగా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమకు సత్వర న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెల్ల మజ్ను, గుమ్మెర్ల గంగారం, గుమ్మర్ల నరసయ్య, సాగర్, గోపి, భూమేష్, రాహుల్, అభి, గైని రమేష్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ మంజూరుపట్ల హర్షం

- ఎమ్మెల్యే భూపతిరెడ్డికి ధన్యవాదాలు తెలిపిన గ్రామస్తులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి


మాట్లాడుతున్న పలువురు

ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి లో 33/11 కె వి సబ్-స్టేషన్ నిర్మాణం మంజూరు చేయడం పట్ల గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతల కిషన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ప్రత్యేక చొరవతో ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి(ఐ)లో 33/11 కెవి సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం తహసిల్దార్ వెంకట్రావు, మండల రెవెన్యూ అధికారి మోహన్, సర్వేయర్, టీ జీ ఎస్పీడీసీఎల్ ఏఈ పండరినాథ్, పంచాయతీ కార్యదర్శి తిరునగరి శ్రీధర్, మాజీ ఎంపీటీసీ చింతల దాస్, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ధర్పల్లి ప్రభాకర్‌తో కలిసి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గురుకుల పాఠశాల సమీపంలో రెండు ఎకరాలు భూమి పరిశీలించి నివేదికకు అందజేయడం జరుగుతుందని తహసిల్దార్ వెంకట్రావు తెలిపారు. తిర్మన్ పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో మొత్తం గ్రామానికి డిచ్ పల్లి మండలం లోని రాంపూర్ (డి), గన్నారం సబ్ స్టేషన్‌ల నుండి విద్యుత్ సరఫరా అవుతుందని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఎన్నిసార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించిన పరిష్కారం కాలేదని అన్నారు. ఈ సారి ఎన్నికల సమయంలో గ్రామస్తులకు సబ్ స్టేషన్ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారని,ఈ మేరకు సబ్ స్టేషన్ నిర్మాణంకోసం నిధులు మంజూరు చేయడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో వి డి సి ఉపాధ్యక్షులు మేకల శేఖర్, జరుగు రాజన్న, అన్నారం శేఖర్, బిరిష్ శెట్టి, గంగారం, కంజర ప్రసాద్, గాండ్ల సాగర్, కలిగోడు సతీష్, అబ్బ గొని శేఖర్ గౌడ్, తెడ్డు మహేందర్, పూసల సంతోష్, వీరముష్టి ప్రశాంత్, డైరెక్టర్ బొక్క గంగాధర్ పాల్గొన్నారు.

శ్రీ చైతన్య విద్యాసంస్థలపై తీసుకోవాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల పైన చర్యలు తీసుకోవాలని నిజామాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షురాలు అంజలి మాట్లాడుతూ ఈటెక్నో, టెక్నో అనే తోక పేరుతో నడుపుతున్న శ్రీ చైతన్య విద్యాసంస్థల యాజమాన్యంపైన చర్యలు తీసుకోవాలని, దీంతోపాటు విద్యార్థులకు స్కూల్ టైమింగ్ కాకుండా పొద్దున్న తొమ్మిది నుండి రాత్రి 8 గంటల వరకు క్లాసులు బోధిస్తూ విద్యార్థులను ర్యాంకుల పేరుతో మానసికంగా ఇబ్బందులు పెడుతున్నారు. గూపన్‌పల్లిలో గల శ్రీ చైతన్య పాఠశాలలో హాస్టల్ పర్మిషన్ లేకుండా నడిపిస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం లేదని అన్నారు. క్వాలిఫైడ్ టీచర్స్ లేకపోవడం, నెలకు ఒక టీచర్ మారడం, ప్రిన్సిపాల్ మారడంవల్ల దీని ద్వారా వాళ్ళ సబ్జెక్టు నైపుణ్యాన్ని కోల్పోతున్నారని అన్నారు. విద్యార్థులకు సరిపడా సౌకర్యాలులేనందున వేలల్లో ఫీజు వసూలు చేస్తున్న పట్టించుకోవడంలేదన్నారు. విద్యాశాఖ అధికారులు వెంటనే శ్రీ చైతన్య విద్యాసంస్థల మీద చర్యలు తీసుకొని యాజమాన్యం పైన క్రిమినల్ కేసు నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రఘురాం, నగర సహాయ కార్యదర్శి నవిన్, నాయకులు సుధాకర్, సంధ్య పాల్గొన్నారు.

వార్డెన్ పోస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ బాలికల వసతి గృహంలో (సంరక్షకులు) వార్డెన్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఇంచార్జ్ అధికారిని గరిగే భవాని సోమవారం పేర్కొన్నారు. బాలికల వసతి గృహంలో వార్డెన్ పోస్ట్ ఖాళీగా ఉండడంతో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆసక్తి గల మహిళల అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి తెలిపారు. ఈనెల 26 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని ఆమె తెలిపారు. దరఖాస్తుదారుల ఉద్యోగ అర్హత బి.ఎడ్ లేదా డిగ్రీ, వయస్సు 35 సం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని, బాల్కొండ మండలానికి చెందిన వారై ఉండాలని తెలిపారు. ఈ పోస్టు ఔట్సోర్సింగ్ ప్రాతిపదికన రూ.12000 జీతం ఉంటుందని భవాని పేర్కొన్నారు.

నేడు మామిడిపల్లిలో మెగా రక్తదాన శిబిరం

నవతెలంగాణ-ఆర్మూర్


మాట్లాడుతున్న ప్రతినిధులు

రైతు నాయకుడు, గల్ఫ్ కార్మికుల ఆశాజ్యోతి కోటపాటి నరసింహం నాయుడు జన్మదిన వేడుకలు పట్టణంలోని మామిడిపల్లి మున్నూరు కాపు సంఘంలో మంగళవారం నిర్వహిస్తున్నట్టు నిర్వహణ కమిటీ ప్రతినిధులు, న్యాయవాది జక్కుల శ్రీధర్, కొక్కుల విద్యాసాగర్, చేపూర్ రుక్మాజీ సోమవారం తెలిపారు. ప్రతి పుట్టిన రోజున ఏదో ఒక సేవ కార్యక్రమం చేస్తున్నారు. నేడు 65వ పుట్టినరోజున మెగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. నేటి కార్యక్రమంలో ఐదు సార్లు కంటే ఎక్కువసార్లు రక్తదానం చేసిన యువకులను సన్మానించ బోతున్నారు.

నేడు మామిడిపల్లిలో..

మున్సిపాలిటీ లోని మామిడిపల్లి లో 4వ నంబర్ మున్నూరు కాపు సంఘం గోవింద్ పెట్ రోడ్డు బ్రిడ్జ్ పక్కన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారు రక్తం సేకరిస్తారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి సీనియర్ న్యాయవాది లోక భూపతి రెడ్డి పాల్గొంటారు. రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని నిర్వహణ కమిటీ ప్రతినిధులు, యువకులకు పిలుపునిచ్చారు.

దామాషా పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న నాయకులు

దామాషా పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. సోమవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం 18 సంవత్సరాలు పైబడిన వారందరికీ భారత రాజ్యాంగం కల్పించిందన్నారు. సమాజానికి జమిలీ ఎన్నికలు కాకుండా అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లోనే నిర్వహిస్తున్నట దామాషా ఎన్నికలు నిర్వహించాలన్నారు. దామాషా ఎన్నికలంటే (వ్యక్తులను ప్రకటించకుండా ఆయా రాజకీయ పార్టీల గుర్తులతో గెలిచి ఎన్నికలు ముగిసిన తర్వాత ఆ పార్టీకి వచ్చిన ఓట్ల ప్రకారం సీట్లు కేటాయించి పార్లమెంటు, అసెంబ్లీలకు పంపడం) గత 12వ పార్లమెంటు, 14వ పార్లమెంటు సమావేశాల్లో నాడు నల్గొండ ఎంపీగా ఉన్న సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి దామాషా పద్ధతిలో ఎన్నికల విధి విధానాలు ఏ విధంగా ఉంటాయనేది పార్లమెంట్లో ప్రవేశపెట్టారన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఆలోచించి ఈ చట్టంకోసం ముందుకు రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. సమావేశంలో సిపిఐ జిల్లా నాయకులు వై.రాజిరెడ్డి, పి.నరసింగరావు, హనుమాన్లు పాల్గొన్నారు.

పిడిఎస్‌యూ 50వ స్వర్ణోత్సవ ర్యాలీ

- తరలివచ్చిన విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పిడిఎస్‌యు 50 వసంతాల సందర్భంగా పట్టణ కేంద్రంలో స్వర్ణోత్సవ ర్యాలీ సోమవారం నిర్వహించారు. పట్టణంలోని ఎగ్జిబిషన గ్రౌండ్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమానికి పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు ఎం.నరేందర్ అధ్యక్షత వహించగా ముఖ్య వక్తగా సిపిఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి, ప్రభాకర్, పిడిఎస్యు మాజీ నాయకులు, పార్టీ డివిజన్ కార్యదర్శి బి. దేవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు, ఎన్నో త్యాగాల చరిత్ర కలిగిన ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నేటికీ 50 సంవత్సరాలు పూర్తి చేసుకొని స్వర్ణోత్సవాల జరుపుకుంటున్నాం. అమ్మాయిల పైన జరుగుతున్న ర్యాగింగ్ కు వ్యతిరేకంగా పోరాటం చేసి పిడిఎస్ యు ను స్థాపించి నేడు రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్యార్థుల హక్కుల గొంతుకగా పిడిఎస్‌యు అవతరించిందని వారన్నారు. వారి బాటలోని నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం ఎత్తొండ గ్రామానికి చెందిన జేసిఎస్ ప్రసాద్ పోరాటాన్ని ముందుకు నడిపారని, ఎమర్జెన్సీకి కాలంలో కూడా భయపడకుండా ముందుకు నడిచారని వారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.నరేందర్, కార్యదర్శి గణేష్ మాట్లాడుతూ 50 వసంతాల స్వర్ణోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 30న ఉస్మానియా యూనివర్సిటీలో సభ ఉందని అన్నారు. సమ సమాజ స్థాపన కోసం ,శాస్త్రీయ విద్య సాధన కోసం కలిసికట్టుగా జార్జిరెడ్డి ఆశయ సాధనలో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని వారన్నారు.కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అనిల్ కుమార్, ఏరియా ప్రధాన కార్యదర్శి నిఖిల్, ఏరియా నాయకురాలు మమత, సిద్దార్థ, బీరుగొండ, నితిన్, సాయి, వినయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

27న జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 27న జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్వో ముత్తెన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జానపద నృత్యం, (జట్టు,వ్యక్తిగతం), జానపద పాటలు(జట్టు, వ్యక్తిగతం), కథ, రచన, పోస్టర్ మేకింగ్, పెయింటింగ్, హస్తకళలు, టెక్స్టైల్స్, వ్యవసాయ ఉత్పత్తులు తదితర అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్లో పోటీలు జరుగుతాయన్నారు. పోటీలో పాల్గొనేవారు 15 నుంచి 29 సంవత్సరాలలోపు ఉండాలని, జిల్లాస్థాయిలో ఎంపికైన వారు రాష్ట్రస్థాయిలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. అలాగే 26న నగరంలోని మాణిక్ భవన్ పాఠశాలలో జిల్లాస్థాయి సైన్స్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతర 9701177144, 9848219365 నంబర్లను సంప్రదించాలన్నారు.

రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌ను కలిసిన ముప్పగంగారెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా ముప్పగంగారెడ్డిని నియమించిన సందర్భంగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా తాహెర్ బిన్ హందన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ముప్పగంగారెడ్డి మాట్లాడుతూ.. తనకు ఈ పదవి వచ్చినందుకు సంతోషంగా ఉందని కష్టానికి తగ్గ ఫలితం దక్కిందన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవిని ఇచ్చిన అధిష్టానానికి కట్టుబడి నమ్మకాన్ని నిలబెడతానని తెలియజేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
కామారెడ్డి
మంగళవారం | సెప్టెంబర్ 24, 2024 | www.navatelangana.com

టీపీసీసీ చీఫ్‌ను కలిసిన ఇసన్నపల్లి నాయకులు


జ్ఞాపిక అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఇసన్నపల్లి కాంగ్రెస్ నాయకులు, టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు శ్రీ కాలభైరవ స్వామి జ్ఞాపికను అందజేసి, ఆలయాన్ని సందర్శించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కందూరి పెద్ద లింబాద్రి, దోమకొండ బైరయ్య, చింతల రవీందర్, తుమ్మల రమేష్, చెట్టుపల్లి బైరయ్య, రెడ్డిపేట బాలయ్య తదితరులు ఉన్నారు.

రైతుబీమా దరఖాస్తు దారుల లిస్టు ఏర్పాటు



నవతెలంగాణ-రెంజల్

2024-25 సంవత్సరంలో నూతనంగా రైతు బీమాకు దరఖాస్తులు చేసుకున్న వారికి పేర్లను గ్రామపంచాయతీ నోటీసు బోర్డుపై ఉంచినట్టు వ్యవసాయ విస్తీర్ణ అధికారి సాయిలు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నీలా గ్రామంలోని రైతుల రైతు బీమా జాబితాను రైతుల సౌకర్యార్థం గ్రామపంచాయతీ నోటీస్ బోర్డ్‌పై అతికించామని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా ఏ కారణం చేతనైనా రైతులు మృతి చెందితే ఆ కుటుంబీకులు అదే రోజు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలన్నారు. ఆయన వెంట గ్రామపంచాయతీ కార్యదర్శి సిహెచ్.సాయిలు, కారోబార్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

- ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి
- సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి
- అధికారులకు, సిబ్బందికి ఆదేశం

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరా చేసేందుకై పంచాయతీ రాజ్ శాఖ లక్ష్యంగా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ డాక్టర్ కుప్పిశెట్టి కిరణ్మయి అధికారులకు, సిబ్బందికి ఆదేశించారు. సోమవారం బాన్సువాడ పట్టణంలో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా బాన్సువాడ సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రజలకు సురక్షితమైన స్వచ్ఛమైన తాగునీరు అందించడం కోసం


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి

ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రజలకు సురక్షితమైన స్వచ్ఛమైన నీరు అందేలా కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ఉన్న మంచినీటి ట్యాంకులను క్షుణ్ణంగా పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రస్తుతం డయేరియా వ్యాధి విజృంభనలో ఉందని దాన్ని అరికట్టే ప్రయత్నాలు అన్ని శాఖలు సమన్వయంగా చేపట్టాలన్నారు. ఈ వ్యాధి సోకకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఎక్కడ మురుగునీటి నిల్వలు ఉండకూడదని, ఎప్పటికప్పుడు తొలగించే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే తద్వారా దోమలు వృద్ధి చెంది వివిధ రకాల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. పారిశుధ్యం మెరుగుదలకు అనునిత్యం ప్రజలకు అవగాహన కల్పిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని గ్రామ సిబ్బందికి ఆయన ఆదేశించారు. దీంతో పాటుగా క్లోరినేషన్ చేసిన పరిశుభ్రమైన నీటిని మాత్రమే కుళాయిల్లో సరఫరా చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ట్యాంకుల లోపల పరిశుభ్రత లోపించిన, నాణ్యమైన తాగునీరు సరఫరాలో ఫిర్యాదులు అందిన తగు చర్యలు తప్పవని ఆమె సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం సబ్ కలెక్టర్ సిబ్బందికి తగు సలహాలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ అధికారులు, సిబ్బంది, తాగునీటి సరఫరా క్షేత్రస్థాయి సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ కుమార్‌రెడ్డిని కలిసిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే

నవతెలంగాణ-సదాశివనగర్

ఎల్లారెడ్డి నియోజకవర్గ కాళేశ్వరం ప్యాకేజీ 22 పనులపై భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యే మదన్ మోహన్ సోమవారం కలిశారు. భూంపల్లి, కాటేవాడి, మోతే ప్రాంతాలలో రిజర్వాయర్ నిర్మాణ పనులు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ కోరారు. ఈ పనులు పూర్తి అయితే లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని ఎమ్మెల్యే మదన్ మోహన్ నీటిపారుదల శాఖ మంత్రికి తెలిపారు. ఈ సమావేశంలో ఇంజనీర్ అండ్ చీఫ్ అనిల్, ప్రిన్సిపాల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్ఐకి సన్మానం


ఎస్ఐని సన్మానిస్తున్న బీర్కూర్ గ్రామస్తులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

తొలి ప్రయత్నంలోనే ఎస్సైగా ఎంపికై ఏడాది కాలం పాటు శిక్షణ పూర్తి చేసుకుని బీర్కూర్ గ్రామానికి చెందిన కీర్తి రాజ్ మొట్టమొదటిసారిగా బీర్కూర్‌కు వచ్చినందుకు కీర్తి రాజుకు గ్రామస్తుల స్వాగతం పలికారు. తొలి అక్షరాలు దిద్దిన బీర్కూర్ శ్రీ సాయి పబ్లిక్ స్కూల్ యాజమాన్యం విజయ, శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు కలిసి శిక్షణ ఎస్ఐని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. తమ పాఠశాలలో అఆలు దిద్ది అంచలంచెలుగా ఎదిగి, 2023లో జరిగిన ఎస్సై పరీక్ష ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరిచి తొలి ప్రయత్నంలోనే ఎస్సైగా ఉద్యోగం సాధించారని తెలిపారు. కీర్తి రాజ్ మరింత ఉన్నత స్థాయిలో ఉండాలని శ్రీ సాయి పబ్లిక్ స్కూల్ యాజమాన్యం ఆకాంక్షించారు. బీర్కూర్ మండల ప్రజలకు కీర్తి రాజ్ ఒక ఆదర్శమని ప్రతి ఒక్కరూ పోటీ పరీక్షలు పోటీపడి ప్రయత్నిస్తే కానిది ఏది లేదన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కీర్తి రాజుకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చందు, పట్టణ అధ్యక్షుడు యామ రాములు, బండ సాయిలు, క్యాకప్ప, మేకల రాజు, గొల్ల శేఖర్, బూత్ పల్లి అనిల్, మిత్రబృందం ఘనంగా సన్మానించారు.

భారతీయ కిసాన్ సంఘ్ సింగరాయపల్లి కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన భారతీయ కిసాన్ సంఘ్

నవతెలంగాణ-రామారెడ్డి

పాల్వంచ మండలం సింగరాయపల్లి భారతీయ కిసాన్ సంఘ్ కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా చెన్నం సత్యంరెడ్డి, కార్యదర్శిగా అన్న బోయిన అంజయ్య, సహాయ కార్యదర్శిగా మెదక్ రామస్వామిగౌడ్, చెన్నం సాయిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

రేకుల షెడ్‌లో నడుపుతున్న
పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

- విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలోని మాచారెడ్డి మండల కేంద్రంలో ఉన్న ఎస్‌కేడిజి పాఠశాల, నాగిరెడ్డిపేట్ మండలంలో ఉన్న పాఠశాలలను ఆ యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా రేకుల షెడ్‌లో నడుపుతున్నారని, ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యార్థి సంఘాల నాయకులు కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు


వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

మాట్లాడుతూ.. రేకుల షెడ్‌లో నడవడం వల్ల విద్యార్థులు వేడికి తట్టుకోలేకపోతున్నారని, వర్షం పడితే ఆ శబ్దానికి విద్యార్థులు భయపడుతున్నారన్నారు. జీవో నెంబర్ 1 ప్రకారం రేకుల షెడ్లలో పాఠశాలలో నడపద్దని విద్య హక్కు చట్టం చెబుతున్నా అధికారులు ఇష్టానుసారంగా అనుమతులు ఇస్తున్నారని తెలిపారు. రేకుల షెడ్లలో ప్రమాదాలకు గురై అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. పాఠశాలలో విద్యార్థులు ఆడుకోవడానికి ఆటస్థలం గాని సరైన మౌలిక సదుపాయాలు లేవన్నారు. విద్యార్థులకు సరైన బాత్రూంలు, టాయిలెట్‌లు లేవన్నారు. కావున నిబంధనలు విరుద్ధంగా నడుపుతున్న ఎస్‌కెడీజీ, పాఠశాలపై చర్యలు తీసుకొని అనుమతిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భారతీయ విద్యార్థి మోర్చా బీవీఎం రాష్ట్ర కార్యదర్శి జివియం విఠల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అరుణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ మణికంఠ, నాయకులు సాయి, నితీన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతం కోసమే సమావేశాలు

నవతెలంగాణ-లింగంపేట్

గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసమే గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ సమావేశం నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు బుర్ర నారాగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని కొర్పోల్ గ్రామంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు లింగంపేట్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు బుర్ర నారాగౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని, కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు బుర్ర నారాగౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జొన్నల రాజు, మాజీ మండలాధ్యక్షులు ఎల్లమయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపాల్, దురుశెట్టి అశోక్, సంద బాలయ్య, సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ నగేష్, యూత్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర రామకృష్ణ గౌడ్, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకూ గుర్తింపు

- ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు

నవతెలంగాణ-మద్నూర్

కాంగ్రెస్ గెలుపు కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ గుర్తింపు ఉంటుందని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు అన్నారు. గాంధీభవన్‌లో రాష్ట్ర పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఉమ్మడి జిల్లాల ముఖ్య నాయకులతో జరిగిన ప్రత్యేక సమావేశంలో పార్టీ బలోపేతం కోసం పూర్తిస్థాయిలో చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలో గెలుపు కోసం కష్టపడే కార్యకర్తకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయండి

- పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని మెల్లకుంట తండా, జనకంపల్లి, పల్లె బొగుడ తండా, బెజగం చెరువు తండా, బొల్లారం, నాగిరెడ్డిపేట్ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీ కార్యకర్తలు పార్టీ బలోపేతం దిశగా పనిచేయాలని ఆయన అన్నారు. గ్రామాలలో సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని తెలిపారు. గ్రామాలలో ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ సంఘం సభ్యులు రామచంద్రరెడ్డి, తాండూర్ సొసైటీ చైర్మన్ ఆకిడి గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి దివిటీ కిష్టయ్య, మాజీ సర్పంచులు బాల్‌రెడ్డి, విట్టల్, జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు మంజూరు చేయాలి


- ఎంపీఓకు వినతి


ఎంపీఓకు వినతిపత్రం అంజేస్తున్న పారిశుధ్య కార్మికులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని పోచారం గ్రామపంచాయతీలో పనిచేస్తున్న సిబ్బందికి గత ఎనిమిది నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని, వెంటనే వేతనాలు మంజూరు చేయాలని కోరుతూ పారిశుధ్య కార్మికులు సోమవారం మండల పరిషత్ అధికారి మన్మోహన్ శాస్త్రికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా గత 8 నెలల నుంచి జీతాలు మంజూరు కాకపోవడంతో తమ కుటుంబాల పూట గడవటం కష్టంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి గ్రామపంచాయతీలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి బకాయి జీతాలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన ఎంపీఓ మన్మోహన్ శాస్త్రి మండల ప్రత్యేక అధికారి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తానని తెలిపారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గానికి సన్మానం


పాలకవర్గాన్ని సన్మానించిన పలువురు

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి మార్కెట్ కమిటీ అధ్యక్షునిగా గైక్వాడ్ హనుమంతు పదవి స్వీకరించడంతో ఎమ్మార్పీఎస్ బాన్సువాడ నియోజకవర్గ నాయకులు సోంపూర్ పోచీరాం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించబడిన రిజర్వేషన్‌తో దళితులకు పదవులు దక్కుతున్నాయని పేర్కొన్నారు. దళిత నాయకులు గైక్వాడ్ హనుమంతుకు చైర్మన్ పదవి ఇవ్వడం ఆనందదాయకమని ఇటువంటి మరిన్ని పదవులు చేపట్టాలని పోచిరాం పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ సభ్యులను సన్మానించడం పట్ల హనుమంతు ఆనందం వ్యక్తం చేశారు. మార్కెట్ కమిటీ అభివృద్ధికి, రైతుల శ్రేయస్సుకు నా వంతు కృషి చేస్తానన్నారు. కోటగిరి గ్రామానికి చెందిన పోలివిట్టల గుప్తా మార్కెట్ కమిటీ సభ్యులను సన్మానించారు. సభ్యులను సన్మానించిన వారిలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాములు, రవి, నగేష్ తదితరులున్నారు.

నేడు ప్రధానోపాధ్యాయులకు ఫిజియోథెరపిపై అవగాహన

నవతెలంగాణ-బోధన్

బోధన్, సాలూర మండలాలకు చెందిన ప్రాథమిక పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులకు ఫిజియోథెరపీపై అవగాహన సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ నాగనాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోధన్ ఉమ్మడి మండలాల ప్రధానోపాధ్యాయులు ఉప విద్యాధికారి కార్యాలయంలో ఉదయం 9.00 గంటలకు జరిగే ఈ అవగాహన సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

వరి పంటల పరిశీలన

- మండలంలో 42 ఎకరాలు పంట నష్టం
- వ్యవసాయ అధికారి అనిల్ కుమార్

నవతెలంగాణ-లింగంపేట్


పంటలను పరిశీలిస్తున్న అధికారి అనిల్ కుమార్

మండలంలోని ఆయా గ్రామాలలో సోమవారం ఈదురుగాలులతో కూడిన వర్షం కారణంగా నేలకొరిగిన వరి పంటలను మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్ సందర్శించారు. మండలంలోని పోతాయిపల్లి, కన్నాపూర్, పొల్కంపేట్ గ్రామాలలో గత రెండు రోజుల క్రితం ఈదురు గాలులు వర్షం కారణంగా చేతికొచ్చిన వరి పంట నేలకొరిగింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలోని పోతాయిపల్లి, కన్నాపూర్, పొల్కంపేట్ గ్రామాలలో 29 మంది రైతులకు చెందిన 42 ఎకరాల పంట నేలకొరిగిందని, ఈ నివేదికను జిల్లా అధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. పోల్కంపేట క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి రాకేష్, రైతులు లక్ష్మీనారాయణ, సంగమేశ్వర్, కిష్టయ్య, రాజు, అనిల్, రాజేందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య యూత్ జిల్లా అధ్యక్షునికి రాష్ట్ర కార్పొరేషన్ చైర్మెన్ సన్మానం

నవతెలంగాణ-పిట్లం


అధ్యక్షునికి పుష్పగుచ్ఛం అందజేత

కామారెడ్డి ఆర్యవైశ్య మహాసభ యూత్ జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన మండల కేంద్రానికి చెందిన బొడ్ల రాజుకు తెలంగాణ ఆర్యవైశ్య రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత సన్మానించారు. సోమవారం ఎల్లారెడ్డి డివిజన్ కేంద్రంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఎన్నికలతో పాటు జిల్లా యూత్ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షులు బొడ్ల రాజు మాట్లాడుతూ.. జిల్లా ఆర్యవైశ్య యూత్ అధ్యక్షులుగా నియమింపజేసిన ఆర్యవైశ్య యూత్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో పదవి కట్టబెట్టినందుకు యూత్ సభ్యుల కొరకు ఎల్లవేళలా కృషి చేస్తూ, వారి అభ్యున్నతికి పాటుపడతానని అన్నారు. అనంతరం ఆయన ఎన్నిక పట్ల పలువురు శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించి ప్రశంసించారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా ఆర్యవైశ్యులు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

నవతెలంగాణ-లింగంపేట్

యువత చెడువ్యసనాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కళాబృందం సూచించింది. సోమవారం మండల కేంద్రంలో తెలంగాణ సాంస్కృత సారధి కళాకారులు కళా ప్రదర్శన నిర్వహించారు. జిల్లా కలెక్టర్, డిపిఆర్ఓ ఆదేశాల మేరకు పరిసరాల పరిశుభ్రత, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. యువత అమూల్యమైన జీవితాన్ని మత్తు పదార్థాలకు అలవాటు పడి నాశనం చేసుకుంటున్నారని ఈ సందర్భంగా వారు పాటల రూపంలో వివరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు లక్ష్మీనారాయణ, దేవన్న, మహేందర్, దివ్య, రమేష్, నాగరాజు, రాము, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరానికి స్పందన


ఐ.యస్.ఆర్.డి ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు

నవతెలంగాణ-సదాశివనగర్

సూర్య ఆరోగ్య సంస్థ నిజామాబాద్, ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (ఐ.యస్.ఆర్.డి) స్వచ్ఛంధ సంస్థ కామారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సదాశివనగర్ మండలం లింగంపల్లి గ్రామంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యాధికారి డా.ఆస్మా అఫ్షీన్ రోగులను పరీక్షించి వారికి వ్యాధులు పట్ల అవగాహన కల్పించారు. 158 మంది రోగులను పరీక్షించి ఉచితంగా తగిన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూర్య ఆరోగ్య సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రాజేంద్ర విక్రమ్, అమృత రాజేందర్, వినోద్ కుమార్, ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (ఐ.యస్.ఆర్.డి) స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షులు సోలంకి రవళి, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్, ఏఎన్ఎంలు సంగీత, లలిత, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామాభివృద్ధి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా క్యాంపు గ్రామంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కార్యకర్త సోమవారం విచారణ చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి.. గ్రామంలో నివసిస్తున్న గంగాధర్, అనురాధ దంపతులకు ముగ్గురు పిల్లలు ఉదయ్, నేహ శ్రీ, మరో ఏడు నెలల బాబు ఉన్నాడు. అయితే గంగాధర్ భార్య అనురాధ జనవరిలో మృతిచెందింది. తద్వారా పిల్లల ఆలనా పాలన కరువవడంతో చుట్టుపక్కల వారు ఇది గమనించి చైల్డ్ హెల్ప్ లైన్‌కు సమాచారం అందించారు. దీంతో సంబంధిత అధికారి ముజాహిద్ స్థానిక అంగన్వాడీ కార్యకర్తను గ్రామానికి వెళ్లి విచారించాలని ఆదేశించారు. దీంతో ఆమె సోమవారం నీలా క్యాంపు గ్రామంలో విచారణ చేపట్టగా.. తండ్రి గంగాధర్ చైల్డ్ అధికారులకు తన పిల్లలను ఇవ్వనని, తన సొంత గ్రామమైన సాలురాకు వెళ్లిపోతానని చెప్పడంతో ఇదే విషయాన్ని ఆమె ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.

ఆర్టీసీ సూపరింటెండెంట్‌గా బస్వంత్


సూపరింటెండెంట్‌ను సన్మానిస్తున సిబ్బంది

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

బాన్సువాడ ఆర్టీసీ డిపో సూపరింటెండెంట్‌గా బస్వంత్ బాధ్యతలను స్వీకరించారు. సోమవారం బాన్సువాడ ఆర్టీసీ డిపోకు బదిలీపై వచ్చిన సూపరింటెండెంట్ బసంత్‌ను ఆర్టీసి సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. అనంతరం సన్మానించారు. ఈ సందర్భంగా బస్వంత్ మాట్లాడుతూ.. బాన్సువాడ ఆర్టీసీ డిపో అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. అలాగే డిపోలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరి, సాగర్, హన్మంత్, కృష్ణ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
మంగళవారం | సెప్టెంబర్ 24, 2024 | www.navatelangana.com

ఆపరేషన్ కోసం ఆర్థిక సహాయం



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్
భీంగల్ మండలం బెజ్జోర గ్రామానికి చెందిన పుప్పాల హంస కు ఇటీవల ప్రమాదం జరిగడంతో ఆపరేషన్ చేసి రాడ్ వేశారు. వారిది నిరుపేద కుటుంబం అని వైద్య ఖర్చులకు డబ్బులు లేకపోవడంతో స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ద్వారా విషయాన్ని తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ఆపరేషన్ కొరకు ఐదువేల రూపాయల ఆర్థిక సహాయాన్ని పంపించారు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందించారు.

వాటర్ ట్యాంక్ వితరణ



వాటర్ ట్యాంకును అందజేస్తున్న రాజేందర్

నవతెలంగాణ-ముప్కాల్
ముప్కాల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆరవ తరగతి చదువుతున్న ఎం.అశ్విత విద్యార్థిని తండ్రి రాజేందర్ సోమవారం 500 లీటర్ల వాటర్ ట్యాంక్ ను తనవంతుగా పాఠశాలకు బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ జి.వినోద బహుకరణ దాతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కలెక్టర్ సార్.. జీజీహెచ్‌లో విచారణ చేపట్టండి

- నిధుల దుర్వినియోగంపై ప్రభుత్వం, అధికారులు స్పందించాలి
- సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) డిమాండ్



వార్తా కథనాల కాపీలతో ధర్నా చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఎన్నో రకాల అవినీతి జరుగుతుందని పలు పత్రికల్లో వార్తలు వచ్చాయని, ఈ అంశాలను పరిగణలోకి తీసుకొని కలెక్టర్ సార్.. జీజీహెచ్‌లోని ప్రతి విభాగంలో క్షుణ్ణంగా పరిశీలించి విచారణ చేపట్టి అవినీతికి పాల్పడిన అధికారులకు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, అవినీతి జరిగిన సొమ్మును రికవరీ చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) పార్టీ నగర కార్యదర్శి ఎం.సుధాకర్ అన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో నిధుల దుర్వినియోగంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, దుర్వినియోగమైన నిధులను రికవరీ చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగం అవుతున్నట్టు పత్రికల్లో కథనాలు వచ్చాయన్నారు. జీజీహెచ్ ఆరోగ్యశ్రీ విభాగంలో ఉద్యోగుల నిర్లక్ష్యంతో సుమారు రూ.9కోట్ల వరకు నష్టం వాటిల్లిందన్నారు. ఆరోగ్యశ్రీ నిధులు జీజీహెచ్‌కు రాకపోవడంతో ఎన్నో రకాల వైద్య సేవలు, పరికరాలు రోగులకు అందకుండా పోయాయని తెలిపారు. బాధ్యులైన సిబ్బందిపై జీజీహెచ్ అధికారులు తీసుకున్న చర్యలు శూన్యమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. చికిత్స కోసం వస్తున్న పేషంట్లను అక్కడి సిబ్బంది కార్పొరేటు ప్రైవేటు ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జరుగుతున్న నిధుల దుర్వినియోగంపై జిల్లా అధికారులు, ప్రభుత్వం తక్షణమే స్పందించాలన్నారు. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకొని దుర్వినియోగమైన నిధులను రికవరీ చేయాలన్నారు. రోగులకు అన్ని రకాల చికిత్సలు అందించాలని, సరిపడా మందులు, నాణ్యమైన భోజనం అందించాలని ప్రభుత్వాన్ని, జిల్లా అధికారులను డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.గణేష్, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు బి.మురళి, టి.విఠల్, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబా, పీఓడబ్ల్యూ నాయకులు అమూల్య, లలిత పిడిఎస్‌యు నాయకులు మహిపాల్, నసీర్, మణెమ్మ, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

- అరోగ్య విస్తరణ అధికారి వై శంకర్



ఇండ్ల పరిసరాలు పరిశీలిస్తున్న ఆరోగ్య విస్తరణ అధికారి

నవతెలంగాణ-డిచ్‌పల్లి
డిచ్ పల్లి మండలంలోని రాంపూర్ డి, యానంపల్లి తండా, దూస్గాం గ్రామాలలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామంలో దోమల నివారణ మందును పిచికారి చేశారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ ఆదేశాల మేరకు యానంపల్లి తండా, దుస్గాం, రాంపూర్ గ్రామాల్లో గ్రామ కార్యదర్శులతో కలిసి గ్రామంలో తిరుగుతూ నీటి నిల్వగల ప్రాంతాలలో టేమోపాస్ స్ప్రే చేసినట్లు మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్ అన్నారు. డెంగ్యూ కేసులు ఉన్న ఇళ్ల చుట్టూ 50 ఇళ్లల్లో పైరితం స్ప్రే చేయించడం, ప్రతి ఒక్క ఆశా కార్యకర్త డెంగ్యూ కేసు చుట్టూ 100 ఇళ్లల్లో జ్వరం సర్వే నిర్వహించినట్లు ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ వివరించారు. ప్రజలలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. నీటిని నిల్వగల ప్రాంతాలను గుర్తించి గ్రామ కార్యదర్శికి నివేదిక అందజేశారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, ఫైలేరియా లాంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని దోమ లార్వాలను నాశనం చేయాలని దోమలు పెరుగుదలను నిరోధించాలని గ్రామ సిబ్బందికి ఆదేశించారు. నీరు నిలువగల ప్రాంతాలలో ఆయిల్ బాల్స్ వదలాలని గ్రామ కార్యదర్శికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు,వెంకట్ రెడ్డి, స్వర్ణ ,శోభ, సుజాత ,రేణుక, గంగుబాయి ఆశా కార్యకర్తలు మంజుల, పద్మ తదితరులు పాల్గొన్నారు

మహిళా ప్రయాణికులకు గిఫ్ట్



గిఫ్ట్ అందజేస్తున్న డిపో మేనేజర్ ఆనంద్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
నిజామాబాద్ నుండి వరంగల్ రూట్ నందు నూతనంగా ప్రవేశ పెట్టిన డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికులకు గిఫ్టలను సోమవారం అందజేశారు. గిఫ్ట్ స్కీం ప్రవేశ పెట్టి 15 రోజులకు ఒకసారి గిఫ్ట్ బాక్స్ నుండి డ్రా తీసి ముగ్గురు మహిళా ప్రయాణికులకు బహుమతులను అందజేస్తున్నామన్నారు. ఈనెల ఒకటినుండి 16న మధ్య కాలంలో నిజామాబాద్ నుండి వరంగల్ రూట్లో ప్రయాణం చేసిన ముగ్గురు మహిళా ప్రయాణికులను డ్రా ద్వారా ఎన్నుకున్నట్లు తెలిపారు. జ్యోతి - మారంపల్లి, సావిత్రి - నిజామాబాద్, విజయ లక్ష్మి- నిజామాబాద్ విజేతలుగా నిలిచారన్నారు. విజేతలకు డిపో మేనేజర్ ఆనంద్ బహుమతులు అందజేశారు. మహిళా ప్రయాణికులు ఇట్టి డీలక్స్ బస్సులలో నిజామాబాద్ నుండి వరంగల్ రూట్ లలో ప్రయాణించి బహుమతులు పొందాలన్నారు.

డిగ్రీ కళాశాలలో ఎంఎస్ఎస్ ప్రోగ్రాం



స్వచ్ఛతాహీ సేవలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-మాక్లూర్
మండలంలోని దాస్ నగర్ సమీపంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో "స్వచ్ఛ తాహి సేవ " కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ ధాత్రిక వెంకటేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కళాశాల ఆవరణలో ఉన్న ప్లాస్టిక్, వ్యర్థ పదార్థాలను తొలగించి, దాస్ నగర్ చౌరస్తా వరకు ఇంటింటికి తిరిగి ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే అనర్థాలను గురించి తెలుపుతూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.సరిత, అధ్యాపకులు శ్వేత, సుమలత, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీపై అవగాహన

నవతెలంగాణ-ఆర్మూర్
ఫిజియోథెరపీపై ప్రధానోపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు మండల విద్యాధికారి రాజా గంగారాం సోమవారం తెలిపారు. నిమ్స్ హాస్పిటల్ హైదరాబాద్ వారి ఫిజియోథెరపీ వింగ్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. మానవ శరీరానికి ఏ రకమైన ఆహారం అందించాలి, ఏ రకంగా ఫిట్నెస్ మెయింటెన చేసుకోవాలి అనే అంశాలను ఫిజియోథెరపిస్టులు మహేష్ కుమార్, వెంకటరమణ వివరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నరసయ్య శ్రీనివాస్, విశ్వనాథం, ప్రధానోపాధ్యాయులు హరిత పాల్గొన్నారు.

నగరంలో పట్టపగలే చోరీకి యత్నం

- స్థానికులు పట్టుకొని దేహశుద్ధి

నవతెలంగాణ-కంఠేశ్వర్
నిజామాబాద్ నగరంలో ఓ యువకుడు పట్టపగలే చోరీకి యత్నించాడు. ఈ సంఘటన సోమవారం మధ్యాహ్నం నగరంలోని బోధన్ రోడ్ లో గల సీఎం రోడ్ గల్లీలో జరిగింది. స్థానికంగా మదర్సా మజారుల్ పొలం ప్రాంతంలోని వాజిద్ ఖాన్ ఇంటిలో చోరీయత్నం జరిగింది. నగరంలోని డైరీ ఫాంకు చెందిన నసీర్ అనే యువకుడు పట్టపగలు ఇంట్లో ఎవరూ లేని సమయంలో కూడా తలుపు బద్దలు కొట్టి ఇంట్లోకి ప్రవేశించాడు. బంగారు నగలను దొంగిలించేందుకు బీరువాను ధ్వంసం చేశాడు. స్కూల్ పిల్లల కోసం బయటకు వెళ్లిన యజమాని షారుక్ పిల్లలతో సహా తిరిగి వచ్చాడు. అతడిని చూసిన నసీర్ కత్తితో బెదిరించి పారిపోయేందుకు యత్నించాడు. దానితో అప్రమత్తమైన స్థానికులు ఆయన్ను పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు.

కాంగ్రెస్ ఇన్‌చార్జి జన్మదిన వేడుకలు



ఆర్మూర్: పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్/మాక్లూర్
కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి జన్మదినన్ని పురస్కరించుకొని బీసీ సెల్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం టీచర్స్ కాలనీలో డిఫెండం స్కూల్ నందు పిల్లలకు పండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీసీ సెల్ అధ్యక్షులు థోండి రమణ మాట్లాడుతూ వినయ్ అన్న ఎన్నో ఉన్నతమైన పదవులు చేపట్టాలని పేద ప్రజలకు అండగా నిలవాలని నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పట్టణ బీసీ సెల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు థోండి గంగమణి, పసుపుల నరేష్,పింజ అభినవ్, నిశ్చయ్ దీప్, రణతేజ్, నాని, రఘువంశీ స్కూల్ టీచర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలోని తపస్విలో
వినయ్ రెడ్డి జన్మదినం సందర్భంగా పట్టణంలోని మామిడిపల్లి తపస్వి యందు విద్యార్థిని విద్యార్థులకు అన్నదానంచేశారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిబాబా గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ అయ్యప్ప శ్రీనివాస్, కౌన్సిలర్లు కోన పత్రి కాశీరాం, ఆకుల రాము, ఇట్టే డి నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్: మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆర్మూర్ నియోజక వర్గ ఇంఛార్జి పి. వినయ్ రెడ్డి జన్మదిన వేడుకలను మండల పార్టీ, యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచారు. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాదాపూర్ ప్రభుత్వ పాఠశాలలో కేక్ కాట్ చేసి విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు రవి ప్రకాష్, ఏ ఎంసి డైరెక్టర్ వెంకటేశ్వర్ రావు, మాజీ సర్పంచ్ రాజేందర్, సింగిల్ విండో చైర్మన అశోక్, సోషల్ మీడియా ఇంఛార్జి జైల్ సింగ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వినోద్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ అర్ధశతాబ్ద సభను విజయవంతం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ
అక్టోబర్ 24 న ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే పిడిఎస్‌యూ అర్ధ శతాబ్ద సభను విజయవంతం చేయాలని పి.డి ఎస్.యూ నాయకులు రవీందర్ , దేవిక విద్యార్థులకు పిలుపునిచ్చారు. అర్ధ శతాబ్ద సభ పోస్టర్స్ ను నిజామాబాద్ నగరంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాకేష్, పాండు, నిరాజ్, రాము, సాయి, మహేష్, వికాస్, శివ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే ఉత్తమ మార్కెట్ కమిటీగా నిలపాలి



సునీల్‌రెడ్డిని కలిసిన ఏఎంసీ చైర్మన్లు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
కమ్మర్‌పల్లి, వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ చైర్మన్లుగా నియమితులైన పాలెపు నర్సయ్య, కొత్తింటి ముత్యంరెడ్డి సోమవారం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి, బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్‌లను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. తమకు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సత్కరించారు. వైస్ చైర్మన్‌లు సుంకేట బుచ్చన్న, గడ్డం నర్సారెడ్డి, పాలకవర్గం సభ్యులకు అన్వేష్‌రెడ్డి, ముత్యాల సునీల్ కుమార్ శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. పాలకవర్గం సభ్యులు కష్టపడి పనిచేసి రాష్ట్రంలోనే ఉత్తమ వ్యవసాయ మార్కెట్ కమిటీలుగా నిలవాలని కోరారు. నూతన చైర్మన్లకు వారు శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు ఆర్యవైశ్యుల సన్మానం
వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన పాలెపు నర్సయ్యను స్థానిక ఆర్య వైశ్య సంఘం సభ్యులు సోమవారం అభినందనలు తెలిపి శాలువాతో సత్కరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి మండలానికి చెందిన వ్యక్తిని వరించడం పట్ల ఆర్య వైశ్య సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం సభ్యులు ఆమేడ నరేందర్, మర్యాల నాగభూషణం, నీలి గోపాల్, ఆమెటి శంకర్, జొన్నల భూషణ్, కాంగ్రెస్ నాయకులు, మాజీ ఉప సర్పంచ్ పాలెపు చిన్న గంగారాం పాల్గొన్నారు.

అంతర్ పాఠశాలల క్రీడలను విజయవంతం చేయండి

- ప్రధానోపాధ్యాయులు పసుపుల సాయన్న

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 26,27,28 తేదీల్లో నిర్వహించి తలపెట్టిన మండల అంతర్ పాఠశాలల క్రీడలను విజయవంతం చేయాలని ప్రధానోపాధ్యాయులు పసుపుల సాయన్న సోమవారం ఒక ప్రకటనలో కోరారు. 2024-25 విద్య సంవత్సరానికి గాను అంతర్ పాఠశాలలకు క్రీడోత్సవాలను కమ్మర్‌పల్లి గ్రామ అభివృద్ధి కమిటీ సహకారంతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐదుసంవత్సరాల విరామం అనంతరం నిర్వహిస్తున్న మండల అంతర్ పాఠశాలల క్రీడల నిర్వహణకు ముందుకు వచ్చిన కమ్మర్‌పల్లి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గర్భిణీ స్త్రీలు ఆరోగ్య నియమాలను పాటించాలి

నవతెలంగాణ-ఆర్మూర్
గర్భిణీ స్త్రీలు తగు జాగ్రత్తలు తీసుకొని, ఆరోగ్య నియమాలు పాటించాలని అర్బన్ అంగన్వాడి సూపర్వైజర్ వెంకటరమణ అన్నారు. సోమవారం పట్టణంలోని కాశీ హనుమాన్-1, అశోక్ నగర్ బి2 అంగన్వాడి కేంద్రాల్లో గర్భిణి స్త్రీలకు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు సిహెచ్ సుజాత, ప్రతిభ, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

మార్చ్ ఫస్ట్‌లో ఆక్స్‌ఫర్డ్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-ఆర్మూర్
జక్రాన్ పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైన మండల స్థాయి క్రీడా పోటీలలో మార్చ్ ఫాస్ట్ పోటీలను నిర్వహించగా పట్టణ శివారు గాంధీనగర్‌లో గల ఆక్స్‌ఫర్డ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రూరల్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ భూపతి రెడ్డి ఆక్స్ఫర్డ్ పాఠశాల విద్యార్థులకు వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రథమ బహుమతిని అందజేసి అభినందించారు. మార్చ్ ఫాస్ట్ పోటీలలో ఆక్స్ఫర్డ్ విద్యార్థులు ప్రథమ బహుమతిని కైవసం చేసుకోవడం పట్ల ఆక్స్ఫర్డ్ పాఠశాల కరస్పాండెంట్ మానస గణేష్, పాలనాధికారిణి పద్మ హర్షం వ్యక్తం చేశారు. వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు శివ సాయి నిఖిల్‌ను అభినందించారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ పాఠశాలల జాబితాలో లిల్లీపుట్



నవతెలంగాణ-ఆర్మూర్
రాష్ట్ర స్థాయి ఉత్తమ పాఠశాలల జాబితాలో లిల్లీపుట్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ చోటు లభించినట్లు పాఠశాల కరస్పాండెంట్ రాజులదేవి రామకృష్ణ సోమవారం తెలిపారు. నూతన బోధన మెళకువలు, కాలాను గుణంగా వస్తున్న సాంకే తిక మార్పులకు అనుగుణంగా అవలంబిస్తున్న ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఉపకరణాలను ఉపయోగిస్తూ, జాతీయస్థాయిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నూతన జాతీయ విద్యా విధానం పాఠ్యప్రణాళికను అమలుపరుస్తున్న ' లిల్లీపుట్ స్కూల్ ఆఫ్ ఎక్సెన్స్ - ఆర్మూర్ "రాష్ట్రస్థాయిలో ఉత్తమ పాఠశాలల జాబితాలో చోటు దక్కి పాఠశాల కరస్పాండెంట్ రాజుల దేవి రామకృష్ణకి హైదరాబాద్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో జరిగిన అవార్డు కార్యక్రమంలో ముఖ్య అతిథి నిజాం వారసులు తొమ్మిదవ నిజాం నవాబ్ రునాథ్ యన్ ఖాన్, భారతదేశ పారిశ్రామిక దిగ్గజం మునిష్ జిందల్ ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ జోష్నా జ్యోత్స్న చేతుల మీదుగా మెమెంటో, సర్టిఫికెట్ తో పాటు సన్మానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పోషకులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి

భర్తకు గాయాలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి
భార్య భర్తలు కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగ లారీ ఢీకొంది.ఈ ప్రమాదంలో భార్య మృతి చెందగా, భర్త గాయాలు పాలై చికిత్స పొందుతున్నారు. ఇందల్ వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని గన్నారం గ్రామానికి చెందిన కుర్మా చిన్న బుజ్జి మల్లయ్య భార్య గంగవ్వ (68) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్ హెచ్ ఓ మనోజ్ కుమార్ తెలిపారు. భార్య భర్త కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. జాతీయ రహదారి 44 గన్నారం యుటర్న్ దగ్గరకు రాగానే వెనుకనుండి వస్తున్న లారీ డ్రైవర్ అజాగ్రత్తగా నడిపి బైక్నఉ ఢీకొన్నాడు. మల్లయ్యకు ఆయన భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. గంగవ్వ హాస్పిటల్ కి చేరుకునే లోపే మార్గ మధ్యంలో మృతి చెందినట్లు ఎస్ హెచ్ ఓ మనోజ్ కుమార్ వివరించారు. మృతురాలి కుమారుడు మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి మర్చురికి తరలించినట్లు ఎస్ హెచ్ ఓ తెలిపారు.

క్రీడా కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తాం

- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- మార్చిఫాస్ట్‌లో తేజస్ విద్యా నికేతన్‌కు మొదటిస్థానం



తేజస్ విద్యానికేతన్ విద్యార్థులకు ఫస్ట్ ప్రైజ్ అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి
బీఆర్ఎస్ ప్రభుత్వం గత ఏడు సంవత్సరాల నుంచి క్రీడలు నిర్వహించలేదని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి అంతర్ పాఠశాలల క్రీడా ఉత్సవానికి నిజాంబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. క్రీడా పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం విద్యార్థులు మార్చి ఫాస్ట్ చేశారు. మార్చిఫాస్ట్ పోటీల్లో తేజస్ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు ఫస్ట్ ప్రైజ్ సాధించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మండల స్థాయి క్రీడలు నిర్వహించక నిర్లక్ష్యం వహించారని కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే సీఎం రేవంత్ రెడ్డి మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం చాలా గర్వకారణం అన్నారు. మండలంలో క్రీడా కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తామన్నారు. గెలుపు ఓటములు సహజమేనని, అలా అని పోటీల్లో పాల్గొనకుండా ఉండకూడదని అన్నారు. అనంతరం మార్చిఫాస్ట్‌లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ సాయి రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, మాజీ సర్పంచ్ లు కాట్పల్లి నర్సారెడ్డి, కిషన్, మాజీ ఎంపీటీసీలు రూపాల గంగారెడ్డి సింగిల్ విండో చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఎంఈఓ శ్రీనివాస్, ఎమ్మార్వో కిరణ్మయి, ఎంపీడీవో సతీష్ కుమార్, హెచ్ఎం లింగన్న, ఫిజికల్ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాల్లో నీరునిల్వకుండా చూసుకోవాలి

- డిప్యూటీ డిఎంఎస్ఓ డాక్టర్ రమేష్

నవతెలంగాణ-ఆర్మూర్
ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు ఉంచుకోకుండా చూడాలని డిప్యూటీ టీఎంహెచ్వో డాక్టర్ రమేష్ అన్నారు. పట్టణంలోని ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఇంటి ఇంటికీ ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వలు ఉన్నట్లయితే దోమలు వృద్ధి చెంది మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వస్తాయని అన్నారు. ఫ్రైడే డ్రైడే ని ఖచ్చితంగా పాటించాలని కోరారు నీటి నిలువలు లేకుండా చూసుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి సాయి, జక్కుల మోహన్, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, బట్టు విజయ, స్వాతి, ఆశలు, బ్రీడింగ్ చెక్కర్స్ సూర్యం, రంజిత్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఒక్క రేషన్‌కార్డు ఇవ్వని బీఆర్ఎస్ ప్రభుత్వం

- ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- సెంట్రల్ లైటింగ్, బీటీ రోడ్ ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి
మండల కేంద్రంలోని సెంట్రల్ లైటింగ్, బీటీ రోడ్డును నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డుల కోసం 90వేల దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాల్లో ఒక తెల్ల రేషన్ కార్డు ఇవ్వలేదని అన్నారు. కాంగ్రెస్ వస్తే కరెంటు ఉండదన్నారు. అది కరెంటుతో రాష్ట్రంలో ఒక కోటి 25 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం మార్కెట్‌కు వస్తుందని తెలిపారు. సన్న రకాల వరి ధాన్యానికి 500 బోనస్ ఇస్తామని చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 9,11వ వార్డు లింగాపూర్‌కు చెందిన అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. తల్లులు, బాలింతలు, గర్భిణులకు పోషక విలువలు ఉన్న ఆహారాన్ని స్థానికంగా లభించే వస్తువులతో పాటు బాలామృతం ఉపయోగించి ఏయే వస్తువులను తయారు చేసుకోవచ్చో వివరించారు. వాటివల్ల లభించే ప్రోటీన్లు, విటమిన్లు వివరించి వాటి ప్రాధాన్యతను తెలిపారు. ఆరోగ్యానికి మించిన ఐశ్వర్యం లేదని, కనుక కిషోర బాలికలు, బాలింతలు, గర్భిణీలు అంగన్వాడీ సేవలను వినియోగించుకొని పోషకారాన్ని ఏ విధంగా తయారు చేసుకోవచ్చునో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ విద్యార్థినిలు, ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ లక్ష్మి, టీచర్ పద్మ, అంగన్వాడీ టీచర్లు ఉమారాణి, వైద్య, టి.పద్మ, జి.లలిత, వి.కల్పన తదితరులు పాల్గొన్నారు.

వరి పంటల పరిశీలన


పంటను పరిశీలిస్తున్న ఏఈవో

నవతెలంగాణ-బోధన్

మండలంలోని పెంటఖుర్దు క్యాంప్, కుమ్మన్‌పల్లి, సాలంపాడ్ క్యాంప్ గ్రామాలలో ఏఈఓ సాయిచరణ్ వరి పంటలను సోమవారం పరిశీలించారు. వరికి ఆశించిన బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు, సుడి దోమ రోగం సోకిన పంట పొలాలను పరిశీలించి రైతులకు నివారణ మార్గాలను సూచించారు. సుడిదోమ నివారణకు డైనోటెఫ్యూరన్ 80 గ్రా లేదా పైమెట్రోజైన్ 120 గ్రా లేదా ట్రైఫ్లూమీజోఫైరిమ్ 94 మి.లీ.ఎకరానికి 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పిచికారీ చేసే ముందు పొలంలో నీటిని తొలగించాలన్నారు. బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు నివారణకు ప్లాంటామైసిన్ 80 గ్రా లేదా అగ్రిమైసిన్ 80 గ్రా ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. ఆయన వెంట రైతులు నాగేశ్వరరావు, రాజా, వెంకటేశ్వరరావు, శ్రీకాంత్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తారు రోడ్డుకు మోక్షమెప్పుడో..?

- అధ్వానంగా గాంధారి-బాన్సువాడ ప్రధాన రహదారి
- పోతంగల్ నుంచి మేడిపల్లి వరకు ప్రయాణంలో ఇబ్బందులు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని గాంధారి-బాన్సువాడ ప్రధాన రహదారి మండలంలోని పెద్ద పోతంగల్ నుండి మేడిపల్లి వరకు రోడ్డు నిర్మాణంలో భాగంగా గత 16 నెలలుగా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంది. గత ప్రభుత్వం పనులు ప్రారంభించి వదిలివేసింది. కొత్త ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తున్నా.. మూడు కిలోమీటర్ల రోడ్డును తారురోడ్డులుగా మార్చలేకపోతున్నారు.

ఎండాకాలం ధుమ్ముతో, వర్షాకాలం బురదతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. మూడు కిలోమీటర్ రోడ్డు పనులు పూర్తి చేయాలని ఎన్నోసార్లు అధికారులకు ఎమ్మెల్యేకు విన్నవించినా రోడ్డు పనులు పూర్తి కావడం లేదని ప్రయాణికులు, మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రోడ్డు పనులు ఆలస్యం వల్ల ప్రమాదాలు జరిగి కొందరు ప్రాణాలు కోల్పోయారు. చాలా వరకు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అయినప్పటికీ అధికారులు అలసత్వం ఎందుకు వహిస్తున్నారో అర్థం కావడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికా రులు, ప్రజాప్రతి నిధులు, ఎమ్మెల్యే తక్షణమే స్పందించి తారు రోడ్డు వేయించాలని ప్రయా ణికులు కోరుతున్నారు. మూడు కిలోమీటర్ రోడ్డుకు పనులు పూర్తి చేయడానికి ఇంకా ఎన్ని నెలలు అవసరం పడుతుందోనని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మధ్యలోనే ఆగిపోయిన పనులు

డాంబర్ రోడ్డు త్వరగా నిర్మించండి



రోడ్డు పనులు ప్రారంభించి సుమారుగా 17 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ డాంబర్ రోడ్డు వేయడం లేదు. దీనివల్ల చాలామంది అవస్థలు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి డాంబర్ రోడ్డును నిర్మించాలి.

– పత్తి రాజులు, గాంధారి

ప్రజల ప్రాణాలు కాపాడండి



కంకర పోసి వదిలేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. అధికారులు తక్షణమే స్పందించి బీటీ రోడ్డును త్వరగా నిర్మించాలి.

– గఫూర్, నేరల్

వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన మహమ్మద్ బహదూర్ ఖాన్ అలియాస్ బాబా కనిపించడం లేదని ఆయన భార్య ఫిర్యాదు చేసినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. అయన తెలిపిన వివరాల ప్రకారం.. విద్యానగర్ కాలనీలో నివాసముండే మహమ్మద్ బహదూర్ ఖాన్ అలియాస్ బాబా(50) డ్రైవరుగా పనిచేస్తున్నాడు. కాగా ఆయన ఈనెల 19న డ్రైవింగ్‌కు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భార్య నూర్జహాన్ అతనికి ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగా బాబా ఆచూకీ తెలిసిన వారు కామారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో లేదా 8712686145, 8712666242 నెంబర్లను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

ఎంపీడీవో కార్యాలయ టైపిస్టు మృతి



నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో టైపిస్టుగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ సోమవారం మరణించారు. కామారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న చెరువులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మరణించినట్లు కార్యాలయ అధికారులు తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

అనారోగ్య బాధితులను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని గోకుల్ తండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు మోహన్ నాయక్ తండ్రి, బిజెపి నాయకులు కృష్ణ యాదవ్ తండ్రి రాజ మల్లయ్య హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతుండగా సోమవారం జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు గిరెడ్డి మహేందర్‌రెడ్డి పరామర్శించారు.

భారతీయ కిసాన్ సంఘ్ మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలో భారతీయ కిసాన్ సంఘ్ మండల కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర సభ్యులు రాము, జిల్లా సభ్యులు లొంక వెంకట్ రెడ్డి, అంజన్న, ఆనంద్ రావు, విఠల్ రెడ్డి, గైని నగేష్, ఆధ్వర్యంలో మండల కమిటీని ఏర్పాటు చేశారు. మండలాధ్యక్షులుగా అర్ల మాధవరావు, ఉపాధ్యక్షులుగా విఠల్ రెడ్డి, కార్యదర్శిగా చాకలి లక్ష్మణ్, సహాయక కార్యదర్శిగా ఆనంద్ రావు, సోషల్ మీడియా కన్వీనర్‌గా అర్ల రాజు, రెవెన్యూ సమస్యల ప్రతినిధిగా వెంకట్ రెడ్డి, రాజేందర్‌రావు, కరెంటు సమస్యల ప్రతినిధిగా సూర్ల కిషన్ రావు, సలహాదారుగా అర్ల శంకర్ రావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సభ్యులు హరలే రావుసాబ్, అర్ల భాస్కర్ రావు, అనిల్, భూపతి, గగ్యనాయక్, బాల్వంత్ రావు, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలి : డీఎల్పీవో నాగరాజు


రాంపూర్‌లో పరిశీలిస్తున్న డీఎల్పీవో

నవతెలంగాణ-పిట్లం

పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజు ఆదేశించారు. సోమవారం మండలంలోని రాంపూర్ (కలాన్) ప్రభుత్వ జిల్లా పరిషత్, ప్రైమరీ పాఠశాలను, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పాఠశాలల సిబ్బంది తమ పాఠశాల గదులతో పాటు వంట సామగ్రి వంట రూములను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన రుచికర భోజనం అందించాలని అన్నారు. విద్యాబోధనలో విద్య ప్రమాణాలను పాటించి విద్యాభ్యాసన చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కమలాకర్, పాఠశాల సిబ్బంది విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో ముందుకు వెళ్లాలి

- ధర్మపురి శ్రీనివాస్ సేవలు మరువలేనివి

నవతెలంగాణ-కంఠేశ్వర్

గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో క్రీడాకారులు ముందుకు వెళ్లాలని డి శ్రీనివాస్ సోదరుడు సురేందర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం మాజీ మంత్రి డి.శ్రీనివాస్ స్మారక క్రీడా పోటీలను స్పోర్ట్స్ ప్రమోషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని పాత కలెక్టరేట్ మైదానంలో ధర్మపురి సురేందర్, స్పోర్ట్స్ ప్రమోషన్స్ సొసైటీ అధ్యక్షులు, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ ప్రారంభించారు. క్రీడా స్ఫూర్తిగా క్రీడా జెండాను ఆవిష్కరించారు. క్రీడాకారులు, విద్యార్థులు మొదట మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం ధర్మపురి శ్రీనివాస్ చిత్రపటానికి స్పోర్ట్స్ ప్రమోషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఎస్ సోదరుడు సురేందర్ మాట్లాడుతూ.. డి.శ్రీనివాస్‌కు క్రీడలంటే ఎంతో ఇష్టమన్నారు. నిజామాబాద్ జిల్లాలో క్రీడా మైదానం కోసం ఎంతో కృషిచేసిన ఘనత డి. శ్రీనివాస్‌ది అని తెలిపారు. నిజామాబాద్ జిల్లా ప్రజలకోసం పాటుపడ్డారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. నిజామాబాద్ నగర తొలి మేయర్ నిజామాబాద్ స్పోర్ట్స్ ప్రమోషన్ సొసైటీ అధ్యక్షులు ధర్మపురి సంజయ్ నేతృత్వంలో ఈ క్రీడా పోటీలు స్థానిక పాత కలెక్టర్ మైదానంలో పోటీలు సాగనున్నాయి. ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా సుమారు 150 పాఠశాల, జూనియర్ కళాశాలల విద్యార్థులు వివిధ క్రీడల్లో ప్రతిభ చాటనున్నారు. మార్చ్ ఫస్ట్ తర్వాత మధ్యాహ్నం నుండి మాజీ మేయర్ డి సంజయ్ కూడా హాజరై క్రీడాకారులకు కావలసిన వస్తువులు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ బాస్కెట్ బాల్ అంశాల్లో పోటీలను ప్రారంభించారు. క్రీడా నిర్వాహకులు సాయిలు, పేటా సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రజల నుంచి అందిన అర్జీలను పరిశీలించి సాధ్యాసాధ్యాల మేరకు తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలపై దరఖాస్తులను స్వీకరించి సంబంధిత అధికారులకు సత్వర పరిష్కారానికి అందజేశారు. భూ సంబంధ, వ్యక్తిగత, తదితర సమస్యలపై పలు అర్జీలను తీసుకొని ఆయా సంబంధిత అధికారులకు పంపించారు. వచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో పొందుపరచడం, వాటి పరిష్కారం, అధికారులు తీసుకున్న చర్యలపై సమీక్షించనున్నట్టు తెలిపారు. కాగా సోమవారం ప్రజావాణిలో 120 అర్జీలు వచ్చినట్టు చెప్పారు. ఈ ప్రజావాణిలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చందర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ అధికారులు, వివిధ విభాగాల పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి ప్రసాదంలో కల్తీ బాధ్యులను శిక్షించాలి

నవతెలంగాణ-బోధన్

తిరుపతి వెంకటేశ్వర స్వామి మందిరంలో ప్రసాదం తయారీకి ఉపయోగించిన ఆవు నెయ్యిలో కల్తీ జరిగినట్లు ప్రయోగశాలలో వచ్చిన నివేదిక ఆధారంగా కల్తీకి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని నిజామాబాద్ జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది సీహెచ్.వి హన్మంతరావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

కార్యకర్త కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని సీతాయిపల్లి గ్రామ బిఆర్ఎస్ నాయకుడు గంగాధర్ సతీమణి కాలికి ప్రమాదవశాత్తు తీవ్ర గాయమై ఆసుపత్రిలో చికిత్స పొందడంతో సోమవారం మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలున్నారు.

సబ్ కలెక్టర్‌ను కలిసిన ఏఎంసీ పాలకవర్గం

నవతెలంగాణ-బోధన్

వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు సబ్ కలెక్టర్ వికాస్ మహతోను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ అంకు సంధ్యదాము వారి పాలకవర్గ డైరెక్టర్లను, వైస్ చైర్మెన్ చీల శంకర్‌ను సబ్ కలెక్టర్‌కు పరిచయం చేశారు.

వీడీసీ స్థలం వివాదంపై నేడు సమావేశం

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని విడిసి ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన స్థలంపై నేడు సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు అఖిలపక్షం కమిటీ, వీడీసీ, ప్రజాప్రతినిధులు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. నేడు యూత్ క్లబ్‌లో పట్టణ కేంద్రంలోని అన్ని కుల సంఘాలు, యువకులు, ప్రజా ప్రతినిధులు, అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. ప్రతి ఒక్కరూ ఈ సమావేశానికి హాజరై వీడీసీ స్థలంపై చర్చలు జరపనున్నట్టు తెలిపారు. స్థల వివాదంపై ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు సమాచారం తెలియజేసి స్థలంపై తుది నిర్ణయం తీసుకోనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు లింబాద్రి, మైపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వేణు, సొసైటీ చైర్మన్ భూమయ్య, నాయకులు మహేందర్‌రెడ్డి, ప్రభాకర్, సాయిలు, సిద్దా గౌడ్ తదితరులున్నారు.

నేడు ఇసుక వేలం

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని శేషాద్రి ఫారం నుంచి సుంకిని వెళ్లే దారిలో 10 ట్రిప్పుల అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంపును సీజ్ చేసినట్టు తహశీల్దార్ జె.మల్లయ్య తెలిపారు. ఆ ఇసుక డంపును మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు తహశీల్దార్ కార్యాలయంలో వేలం వేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ వేలంలో పాల్గొనేవారు రూ.5000 డిపాజిట్ చేయాలని సూచించారు.

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-లింగంపేట్

ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.244 కోట్ల నిధులు కోరుతూ ప్రతిపాదనలను ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్మోహన్ రావు మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సీతక్కను సోమవారం కలిశారు. కాలేశ్వరం 22 ప్యాకేజీ ద్వారా కాటేవాడి, మోతే, బొంపల్లి రిజర్వులపై సమీక్ష సమావేశంలో మంత్రితో పాటు ఎమ్మెల్యే పాల్గొన్నారు. కాలేశ్వరం 22 ప్యాకేజీ ద్వారా మినీ ప్రాజెక్టులు నిర్మాణం చేపట్టినట్లయితే లక్ష ఎకరాలకు సాగునీరు అందించవచ్చని పనులు ప్రారంభించాలని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. పనులు త్వరలో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అలాగే సెక్రటేరియట్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ సీతక్కను కలిసి వెనుకబడిన ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి గానూ నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం, మరమ్మతులు, తండా, గ్రామాల రోడ్లు, వంతెనల నిర్మాణం కోసం రూ.244 కోట్లు నిధులు కోరుతూ ప్రతిపాదనలు మంత్రికి అందజేశారు.

అపరిశుభ్రంగా ఇందిరమ్మ కాలనీ


బురదమయంగా కాలనీ


కాలనీలో నిలిచిన మురుగునీరు.. ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

- ఆందోళనలో కాలనీవాసులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా గ్రామంలోని ఇందిరమ్మ కాలనీ అపరిశుభ్రంగా మారింది. ఈ కాలనీలో రోడ్లు అస్తవ్యస్తంగా మారడమే కాకుండా డ్రయినేజీలో చెత్తచెదారం నిండుకుని దుర్గంధంగా తయారైంది. రోడ్లపై నడవడానికి వీలులేకుండా బురదమయమయ్యాయి. కాలనీవాసులు నానా అవస్థలు పడాల్సి వస్తుంది. కొన్ని రోడ్లపై పిచ్చిమొక్కలు మొలకెత్తి రోడ్లపై నీరు నిలుస్తోంది.

తమ కాలనీ పరిసరాల పరిశుభ్రత ఆమడ దూరంలో ఉందని, వర్షాకాలంలో రోడ్లపై నీరు నిండిపోవడంతో మురికి కాలువలు శుభ్రం లేకపోవడంతో ఆ నీరు రోడ్లపైకి వస్తుందని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురికి కాలువలను శుభ్రం చేసి అందులో చెత్తాచెదారాన్ని రోడ్లపై వేసి తరలించకుండా అక్కడే వదిలి వేశారు. కాలనీ చుట్టూ పెద్ద పెద్ద చెట్లు పెరగడమే కాకుండా వాటి నిండా నీరు నిలిచిపోవడంతో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల ఈ గ్రామంలో విషజ్వరంతో ఓ యువతి మృతిచెందింది. అధికారులు సైతం ఈ కాలనీని సందర్శించినప్పటికీ గ్రామపంచాయతీ సిబ్బందితో పరిసరాల పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత జిల్లా అధికారులు ఈ కాలనీ విషయంలో ప్రత్యేక దృష్టిని సారించి ప్రజల ప్రాణాలను కాపాడాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఇందిరమ్మ కాలనీ అపరిశుభ్రతపై నీలా గ్రామ కార్యదర్శి సిహెచ్ సాయిలును వివరణ అడిగేందుకు సంప్రదించగా.. ఆయన అందుబాటులోకి రాలేదు.

గోవూరులో బీటీ రోడ్డు నిర్మించాలి

- సీపీఐ(ఎం) డిమాండ్

నవతెలంగాణ-వర్ని(మోస్రా)

మోస్రా మండలంలోని గోవూర్ బస్టాండ్ నుంచి గ్రామపంచాయతీ వరకు బీటీ రోడ్డు నిర్మించాలని గోవూర్ సీపీఐ(ఎం) శాఖ డిమాండ్ చేసింది. సోమవారం మహాసభ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకురాలు గంగవ్వ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం సీపీఐ(ఎం) శాఖ మహాసభ నాగయ్య అధ్యక్షతన నిర్వహించారు. వ్యవసాయ కూలీ రేట్ల పెంపు కోసం పోరాటం చేసి, కూలీ రూ.400 పెంచుకున్నామని తెలిపారు. వంటగ్యాస్ ధరల తగ్గింపు, ఉపాధ్యాయుల కొరతపై మూడేళ్ల కాలంలో పోరాటాలు చేశామని సభ్యులు తెలిపారు. భవిష్యత్తులో బీటీ రోడ్డు, హైస్కూల్ వద్ద బస్‌షెల్టర్ ఏర్పాటు కోసం ప్రభుత్వంపై పోరాటాలు చేయాలని తీర్మానాలు చేశారు. గ్రామ పార్టీ శాఖ నూతన కార్యదర్శిగా బొర్ర గంగాధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ తెలిపారు. పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు సైద్ధాంతిక చైతన్యంతో పాటు, నిబద్ధతతో పేద ప్రజల కోసం పనిచేయాలని ఆయన సూచించారు.


మాట్లాడుతున్న నన్నేసాబ్

ఇంటి నిర్మాణాలకు అనుమతి ఇవ్వాలి

- ప్రజావాణిలో

వికలాంగుల సంఘం వినతి

నవతెలంగాణ-ఎడపల్లి

ఇంటి నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని జానకంపేట గ్రామానికి చెందిన బాలాజీ వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో 12 సంవత్సరాలుగా పోరాటం చేస్తే గత ప్రభుత్వం గుర్తించి సుమారు 50 మంది వికలాంగులకు జానకంపేట శివారులో ఇంటి స్థలాలను కేటాయిస్తూ పట్టాలను ఇచ్చిందని, గుడిసెలు వేసుకొని అక్కడ నివాసం ఉంటున్నామని తెలిపారు. కానీ అక్కడ మౌలిక వసతులు, సౌకర్యం లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని వికలాంగులు కలెక్టర్ ఇచ్చిన ఫిర్యాదులు పేర్కొన్నారు. శాశ్వతంగా ఇంటి నిర్మాణాలు చేపట్టుకుంటామంటే జానకంపేట గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రేమ్‌దాస్ ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం లేదని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో బాలాజీ వికలాంగుల సంఘం అధ్యక్షులు రుక్మాయి గంగాధర్, ప్రధాన కార్యదర్శి ఉప్పు మురళి, ఉపాధ్యక్షులు లక్ష్మణ్, సహాయ కార్యదర్శి సందీప్, నరసయ్య, బండారు సాయిలు, జమీల్ పాషా, బైరయ్య, స్వర్ణలత, వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.


ప్రజావాణిలో వినతినిస్తున్న వికలాంగులు

బీసీ బాలుర గురుకుల పాఠశాలకు సొంత భవనం నిర్మించాలి

- కలెక్టర్‌కు ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి

నవతెలంగాణ-కామారెడ్డి

బిబిపేట్ మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ బీసీ గురుకుల బాలుర పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకనుగుణంగా సొంత భవనాన్ని వెంటనే నిర్మించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో కలెక్టర్‌కు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముదాం అరుణ్ మాట్లాడుతూ.. 400 మంది విద్యార్థులుంటే కనీసం వంద మందికి సరిపడా సౌకర్యాలు ఆ భవనంలో లేవని, తద్వారా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. గతంలో అధికారులకు విన్నవించినా ఆ సమస్యను పరిష్కరించడం లేదని అన్నారు. వెంటనే ఆ పాఠశాలను విద్యార్థుల సౌకర్యార్థం వేరే భవనంలోకి తరలించాలని, అదేవిధంగా సొంత భవనాన్ని విద్యార్థులకు అనుగుణంగా వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆ పాఠశాలలో విద్యార్థుల పట్ల సిబ్బంది ప్రవర్తన చాలా దురుసుగా ఉందని వెంటనే సిబ్బంది తమ పద్ధతి మార్చుకోవాలని లేనియెడల పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ మణికంఠ, నాయకులు సాయి, నితీన్ తదితరులు పాల్గొన్నారు.

